సరసమైన ధరలకు నిత్యావసరాలు అందించండి : జేసీ

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులను ప్రజలకు అందించేందుకు ప్రతి మండలంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో ధరల స్థిరీకరణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపిక చేసిన కేంద్రాలు, రైతు బజార్లలో రూ.110లకే పామాయిల్ ప్యాకెట్ విక్రయించాలని సూచించారు. ధరలు సూచించే స్పష్టమైన బోర్డులు దుకాణాల ముందు ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్వో డీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



'ఐదేళ్లుగా చూడని మంచి బ్రాండ్లు.. దానికి తగ్గట్టు ఎమ్మార్పీకే దొరుకుతున్నాయ్. ఇంకేం.' అనుకుంటూ సంబరపడుతున్న మందుబాబుల మత్తు దిగే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. ధరల రూపేణా మద్యంప్రియుల జేబును ఖాళీ చేసే వ్యూహరచన సాగుతోంది. అదెలాగంటారా ఇటీవల లక్కీడిప్‌లో మద్యంషాపులు దక్కించుకున్న వ్యాపారులంతా సిండికేట్ అయ్యేందుకు ప్రణాళిక రచిస్తున్నారు. అందరూ ఏకమై ఎమ్మార్పీ కన్నా 20 శాతం అదనపు ధరకు విక్రయించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

మందుబాబుల ఆశలు గల్లంతు?

- సిండికేట్ అయ్యేందుకు వ్యాపారుల ప్రయత్నం
- ఎమ్మార్పీ కన్నా రూ.20 పెంపు?
- పెట్టిబడి త్వరగా రాబట్టుకునే ప్రయత్నం
- ఇదే జరిగితే మందుబాబుల జేబుకు చిల్లే
- నెలకు రూ. 27 కోట్ల లూటీకి రంగం సిద్ధం.
- తెరవెనుక కొందరు ఎక్సైజ్ అధికారుల సహకారం

వైసీపీ దారుణ పరాజయానికి కారణాల్లో మద్యం కూడా ప్రధానమైనదే. గడిచిన ఐదేళ్లలో మందుబాబులంతా తీవ్ర నిరాశకు గురయ్యారు. మందు నాణ్యత పాతాళానికి పడిపోగా, ధరలు మాత్రం ఆకాశానికి ఎగబాకాయి. ఈ క్రమంలో మద్యప్రియులు ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా!? ఐదేళ్లపాటు రోజువారీగా తమకు జరుగుతున్న అన్యాయానికి ప్రతికారం తీర్చుకోవాలని ఎదురుచూశారు. ఐదేళ్ల వారి నిరీక్షణ ఫలితంగా ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు సీఎం అయ్యారు. మద్యప్రియులు ఆశించినట్లే మద్యం పాలసీ మార్చారు. మద్యం షాపులను ప్రైవేటు వ్యాపారులకు అప్పగించి, నాణ్యమైన బ్రాండ్లు అందుబాటులోకి తెచ్చారు. ఎమ్మార్పీకే అమ్మాలని ఆదేశించారు. ఆ మేరకు ఇప్పటిదాకా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

● ధరల దోపీడీకి రంగం సిద్ధం కానీ.. మందుబాబులకు ఒక చేదు వార్త. రాబోయే రోజుల్లో నాణ్యమైన మద్యం లభిస్తుందనే విషయంలో ఢోకా లేదు కానీ ఎమ్మార్పీకి లభించే అవకాశాలు మాత్రం తక్కువే. కొంతమంది ఎక్సైజ్ అధికారులు, వ్యాపారులు ఒక బృందంగా ఏర్పడి జిల్లావ్యాప్తంగా అన్ని మద్యం షాపులను సిండికేట్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ధర పెంచకపోతే గిట్టుబాటు కాదనే నినాదంతో 20 శాతం అదనంగా రేట్లు పెంచడానికి అందరినీ ఒప్పిస్తున్నారు. ఉదాహరణకు వంద రూపాయలు ఉన్న క్వార్టర్ సీసాను రూ.120లకు విక్రయించనున్నారు.



● నెలకు రూ. 27 కోట్ల దోపిడీ

ఎమ్మార్పీపై 20 శాతం అదనంగా ధర పెంచితే జిల్లాలోని మద్యం ప్రియులు కోట్ల రూపాయల్లో దోపిడీకి గురవుతారు. సెప్టెంబరులో జిల్లా మద్యం అమ్మకాల విలువ రూ.135 కోట్లు. అప్పట్లో ఇంకా ప్రభుత్వ మద్యం దుకాణాలు నడుస్తున్నాయి కాబట్టి షాపు నిర్వాహకులు ఖచ్చితంగా ఎంఆర్‌పీకే విక్రయిం చారు. ఇప్పుడు ఎంఆర్‌పీపై 20 శాతం అదనంగా వసూళ్లు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అలా జరిగితే అదనపు ధర రూపంలో మందుబాబులు నెలకు 27 కోట్ల రూపాయలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

● తిలాపాపం... తలా కొంత

ఎంఆర్‌పీపై 20 శాతం అదనంగా ధర పెంచి అమ్మితే నెలకు 27 కోట్ల మేర మద్యం వ్యాపారులు లాభపడతారు. ఇందులో ఎక్సైజ్ అధికారులకు, పాత్రికేయులకు వాటా ఇవ్వాలని కొంత మంది వ్యాపారులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. సిండికేట్ కోసం సహకరించినందుకు అలాగే అధిక ధర అమ్ముకోవడానికి ఎక్సైజ్ అధికారులు సమ్మతించినందుకు వారికి వాటా ఉంటుంది. ఇక వ్యతిరేక వార్తలు రాయకుండా పాత్రికేయులను ప్రలోభపెట్టే బాధ్యతను కొందరు అధికారులు భుజాన వేసుకున్నారు. వీరందరికీ నెలమామూళ్లు ఇచ్చేందుకు సర్వం సిద్ధమవుతోంది.

● దోపిడీ.. సినిమా త్వరలో విడుదల

ఇంతకూ అధిక ధరల దోపిడీ ఎప్పటి నుంచి అనుకొంటున్నారా!? ఒకరిద్దరు అధికారులు మాత్రం త్వరలో అంటున్నారు. అది రేపైనా కావచ్చు, లేకపోతే లెక్క కరెక్టుగా ఉంటుందని, డిసెంబరు 1వ తేదీ నుంచి అమలులోకి రావచ్చు. విడుదల మాత్రం పక్కా. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి దోపిడీ సినిమాకు సెన్సార్ కత్తెర వేస్తే తప్ప ఈ సినిమా రిలీజ్ ఆగేలా కనిపించడం లేదు.

నెల్లూరు నగరంలోని ప్రతీ భవనానికి కార్పొరేషన్ అధికారులు కొలతలు వేస్తున్నారు. రికార్డుల్లో నమోదైన కొలతలు, వాస్తవ పరిస్థితులు తెలుసుకుని నిర్మాణ సమయంలో పొందిన అనుమతుల్లో అవకతవకలను గుర్తించేందుకు ఈ ప్రక్రియ చేపట్టారు. తాజా కొలతల్లోనూ అక్రమాలు జరగకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. డ్రోన్లు, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా భవనాల పక్కా విస్తీర్ణాన్ని లెక్కించే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ ప్లాన్ అప్రూవల్ ఇవ్వడంలో టీపీఎస్‌ల అవినీతి, ఆస్తి పన్ను విధింపులో ఆర్ఐల చేతివాటం బయటపడనున్నాయి. ఈ వ్యవహారాన్ని కమిషనర్ సూర్యతేజ నిశితంగా పరిశీలిస్తుండటంతో కార్పొరేషన్ రెవెన్యూ యంత్రాంగంలో ఆందోళన మొదలైంది.

ఇల్లిల్లు కొలత

- నెల్లూరులో భవనాల సర్వే
- నిర్మాణాలు, పన్నుల్లో భారీగా అవకతవకలు
- వాస్తవాలేమిటి.. రికార్డులు ఏం చెబుతున్నాయి!
- పన్ను ఎంత ఉండాలి.. ఎంత కడుతున్నారు
- నిజాలు నిగ్గుతేల్చేపనిలో కమిషనర్
- కొలతలకు ఆధునిక టెక్నాలజీ
- టీపీఎస్, ఆర్వో, ఆర్ఐల్లో గుబులు

నెల్లూరు(సిటీ) (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో 166 సచివాలయాల పరిధిలో 1.34 లక్షల పన్ను అసెస్‌మెంట్లు ఉన్నాయి. ప్రస్తుతం వీటన్నింటి కొలతలు తీస్తున్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం భవన నిర్మాణ సమయంలో విస్తీర్ణంలో 5 నుంచి 10 శాతం వరకు కార్పొరేషన్ పేరిట మార్టిగేజ్ చేసి నిర్మాణం పూర్తయ్యాక వ్యత్యాసాలేమీ లేకపోతే మార్టిగేజ్ చేసిన విస్తీర్ణాన్ని తిరిగి నిర్మాణదారుడి పేరున మారుస్తారు. కానీ సిటీ ప్లానింగ్ విభాగంలోని కొందరు టీపీఎస్‌లు నిబంధనలు పాటించని భవనాలకు కూడా మార్టిగేజ్ విడుదలలో డీవియేషన్ స్థాయిని తగ్గించి అనుమతులు ఇచ్చేస్తున్నారు. ఇందుకుగాను భవన నిర్మాణదారుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. ఆ తరువాత ఆర్వోలు, ఆర్ఐల వంతు. ఏ భవనానికైనా కొలతలు తీసి వాస్తవ విస్తీర్ణం ఎంత ఉందో తెలుసుకుని అందుకు తగ్గట్టు పన్ను విధించాలి. కానీ భవన నిర్మాణదారుడు కోరినంత పన్ను విధించేలా విస్తీర్ణాన్ని తక్కువ చేసి చూపిస్తున్నారు. తద్వారా కార్పొరేషన్ ఖజానాకు చేరాల్సిన పన్నులు, ఫీజులను తమ జేబుల్లో వేసుకుంటున్నారు. ఇలా టీపీఎస్‌లు, ఆర్వోలు, ఆర్ఐల అవినీతి మితిమీర డంతో నిజాలు నిగ్గుతేల్చేందుకు తాజాగా భవనాలన్నిటికీ కొలతలేస్తున్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. కొన్నిరోజులుగా ఈ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది.



భవనాలకు కొలతలేస్తున్న అధికారులు

షోకాజు నోటీసులు జారీ

నెల్లూరులో ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌పీసీఐ, హౌస్‌హోల్డ్ జియో కోఆర్డినేట్స్ సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఏడీసీ నందన్ నగరంలోని 14 సచివాలయాలకు షోకాజు నోటీసులను శుక్రవారం జారీ చేశారు. 24 గంటల్లోపు వివరణ ఇవ్వాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొలతల్లో చేతివాటం చూపకుండా..!

దొంగకు తాళా లిచ్చారన్న సామెత తను గుర్తు చేసుకున్న కార్పొరేషన్ ఉన్నతాధికారులు ముందు జాగ్రత్తపడ్డారు. తాజాగా నగర వ్యాప్తంగా జరుగు తున్న భవనాల కొలతలకు వెళ్లిన ఉద్యోగులు అవినీతికి పాల్పడితే అసలుకే మోసం వస్తుందని గ్రహించి శాటిలైట్ మ్యాపింగ్ ప్రక్రియను వినియోగంలోకి తెచ్చారు. ఒక వైపు డ్రోన్ల ద్వారా ప్రాంతాల వారీగా మ్యాపింగ్ చేస్తూనే మరోవైపు ఆ ప్రాంతంలోని భవనాల వాస్తవ కొలతలను లెక్కకడు తున్నారు. ఈ ప్రక్రియ ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉంది. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని నిర్వర్తిస్తున్న అధికారులు, క్షేత్ర స్థాయిలో కొలత లు తీయడం పూర్తయ్యాక శాటిలైట్ తీసిన మ్యాపింగ్‌తో సరిపోల్చనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కొలతలేస్తున్న ఉద్యోగులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

టీపీఎస్, ఆర్ఐలలో ఆందోళన

నగరంలోని భవనాలకు మరోసారి కొల తలు తీస్తుండటంతో ఆర్ఐ, ఆర్వోలు, టీపీఎస్ ల గొంతులో వెలక్కాయపడినట్లు అయింది. తమ అక్రమాలు, అవినీతి బాగోతం ఎక్కడ బయటపడు తుందోనని ఆందోళన చెదుతున్నారు. పెద్ద పెద్ద భవనాలు కట్టుకుని పన్ను మాత్రం తక్కువ చెల్లిస్తుండటం, అలాగే తక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలకు అనుమతి పొంది పెద్ద కట్టడాలు నిర్మించడం వంటివి వెలుగులోకి వస్తుండటంతో ఆయా భవనాల యజమానులకు జరిమానాలు విధించడమేకాక సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది.

మెప్మా పీడీగా రాధమ్మ



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఏ రాధమ్మ గురు వారం మెప్మా కార్యాలయం లో బాధ్యతలు స్వీరించారు. ఇప్పటి వరకు పనిచేసిన పీడీ రవీంద్ర ను ఉమ్మడి చిత్తూరు జిల్లా మెప్మా పీడీగా ప్రభుత్వం బదిలీ చేసింది. రాధమ్మ ఉమ్మడి చిత్తూరు జిల్లా పీడీగా చేస్తూ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సంఘాల బలోపేతానికి, పొదుపు మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి కృషి చేస్తానని చెప్పారు. కలెక్టర్ ఆనంద్‌ను, నగర కమిషనర్ సూర్యతేజను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎన్‌డీసీసీబీలో పదోన్నతులు

● చీఫ్ మేనేజర్లుగా ఆరుగురు మేనేజర్లు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కేంద్రసహకార బ్యాంకులో వివిధ స్థాయిల్లో అధికారులకు, ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. ఆరుగురికి మేనేజర్ స్థాయి నుంచి చీఫ్ మేనేజర్లుగా, ఐదుగురికి అసిస్టెంట్ మేనేజర్ స్థాయి నుంచి మేనేజర్లుగా పదోన్నతులు లభించాయి. అలాగే మరో ఆరుగురికి స్టాఫ్ అసిస్టెంట్ నుంచి అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతులు లభించగా, వీరికి జాయింట్ కలెక్టర్ కార్తీక్ శుక్రవారం ఉత్తర్వులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పదోన్నతులు పొందిన వారికి ఎన్‌డీసీసీబీ ఉద్యోగ సంఘ రాష్ట్ర నాయకుడు కుమార్‌పాల్ శుభాకాంక్షలు తెలిపారు.

పేరుకు శిక్షణ.. అంతా దోపిడీ!

1.. 1.. 1.. 2.. 2.. 3.. 3... ఇదేదో అంకెల లెక్కింపు కాదు. తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు సాధించిన స్థానాలివేనంటూ కొన్ని కోచింగ్ సెంటర్ల ఆర్భాటపు ప్రకటనలివి. ఓ వైపు భారీ కటౌట్లు, మరోవైపు పెద్ద పెద్ద అక్షరాలతో సెంటర్ల పేర్లు, ర్యాంకులన్నీ తమ సంస్థవేనంటూ ప్రసార మాధ్యమాల్లో హోరెత్తిస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులను మభ్యపెడుతూ ఏటా సగటున ఒక్కొక్కరి నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నారు. నీట్, జేఈఈ మెయిన్స్ పేరుతో ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నిర్వాహకుల దందాతో జిల్లాలో ఏటా రూ.100 కోట్ల వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి విద్యార్థి ఇంటర్‌లో అడ్మిషన్ పొందేది ఒక కళాశాల అయితే శిక్షణ మాత్రం జిల్లా కేంద్రంలో ఉంటుంది. అంటే విద్యార్థి అడ్మిషన్ పొందిన కళాశాలకు రెగ్యులర్‌గా వెళ్లకుండా కేవలం పరీక్షల సమయంలో మాత్రమే హాజరవుతాడు. కళాశాలలో మాత్రం ప్రతిరోజూ హాజరవుతున్నట్లు సంబంధిత యాజమాన్యాలు సర్దుబాటు చేస్తుండడంతో కోచింగ్ సెంటర్లలో లాంగ్‌టర్మ్‌లో శిక్షణ పొందుతుంటాడు. ఇంతా చేస్తే అధికశాతం కేంద్రాలకు ఎలాంటి అనుమతులు ఉండకపోవడం విశేషం. ఇవన్నీ తెలిసినా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)





- నీట్, జేఈఈ మెయిన్స్ పరీక్షలకు కోచింగ్
- అనుమతి లేకుండా శిక్షణ కేంద్రాల నిర్వహణ
- అడ్మిషన్లు ఒక చోట.. కోచింగ్‌లు మరోచోట
- ఏటా రూ.100 కోట్ల వ్యాపారం
- తెలిసినా పట్టించుకోని యంత్రాంగం
- కేంద్రం ఆదేశాలతో ఆరా తీస్తున్న అధికారులు

నెల్లూరులో నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌ల కేంద్రాల నిర్వాహకుల హవా అంతా ఇంతా కాదు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే శిక్షణ సంస్థలను పెట్టి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. వీటిని కట్టడి చేయడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమవు తున్నారన్న విమర్శలూ ఉన్నాయి.

మరోవైపు ఈ అధికారుల అండతో, లోపాయికారీ ఒప్పందాలతో నెల్లూరులో యథేచ్ఛగా కోచింగ్ సెంటర్‌లు కొనసాగుతున్నాయన్న ఆరోపణలూ ఉన్నాయి. ఏడాదికి 5వేల మందికిపైగా వివిధ కేంద్రాల్లో శిక్షణ పొందుతుండగా, వీరివద్ద ఒక్కొక్కరి నుంచి రూ.2లక్షలకుపైగానే ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. కోచింగ్ పేరుతో ప్రతి సంవత్సరం రూ.100 కోట్ల వ్యాపారం జరుగుతోందంటే జిల్లాలో విద్యా వ్యాపార దందా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

● వసతులు అధ్వానం

లక్షలాది రూపాయలు వసూలు చేసి కోచింగ్ ఇస్తున్న కేంద్రాల్లో వసతులు మాత్రం అధ్వానంగా ఉంటున్నాయి. ఇరుకైన అద్దె భవనాల్లో వసతిగృహాలు నిర్వహిస్తూ గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారు. వెలుతురు, గాలి లేని గదుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను ఉంచుతున్నారు. కనీస అవసరాలు తీర్చుకో వాలన్నా ఒకరి తర్వాత ఒకరు వెళ్లాల్సిందే. అప్పటి వరకు వారు బయట వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇక భోజనం విషయానికి వస్తే శుభ్రత, పరిశుభ్రత పాటించడం లేదని, దీనివల్ల తమ పిల్లలు అనారోగ్యాల పాలవుతున్నారని పలువురు తల్లిదండ్రులు తెలిపారు. బిడ్డల చదువుల కోసం తప్పని సరి పరిస్థితుల్లో శిక్షణకు చేర్పించాలన్ని వస్తోందని వాపోతున్నారు.

గుర్తింపులేని యాజమన్యాలతో ఒప్పందం...

నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ కోచింగ్ కేంద్రాల నిర్వాహకులకు సొంతంగా ఎలాంటి జూనియర్ కళాశాలలు ఉండవు. వీరు కోచింగ్ సెంటర్లను మాత్రమే నిర్వహిస్తుంటారు. నగరంతోపాటు నగర శివార్లలో అనేక పెద్ద భవనాలు అద్దెకు తీసుకుని ఆకర్షణీయమైన కటౌట్స్‌తోపాటు పెద్ద అక్షరాలతో పేర్లు రాయించి కోచింగ్ సెంటర్లను నడుపుతున్నారు. కరపత్రాలు, పోస్టర్‌లతోపాటు ప్రసార మాధ్యమాల ద్వారా తమ వద్ద శిక్షణ పొందిన వారు అత్యధిక ర్యాంకులు సాధించినట్లు ప్రచారం చేసుకుంటూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. గుర్తింపులేని వివిధ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలతో ఒప్పందం చేసుకుని కోచింగ్ ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని జూనియర్ కళాశాలలు ఒక అనుమతి మాత్రమే తీసుకుని అనధికారికంగా బ్రాంచ్‌లు, కోచింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేసుకుని ఫీజులు వసూలు చేసుకుంటున్నారు. ఇంటర్‌బోర్డు అధికారులు కోచింగ్ సెంటర్లను వెళ్లినపుడు అనేక అవకతవకలు వెలుగు చూడడంతోపాటు విద్యార్థుల అడ్మిషన్లను పరిశీలిస్తే ఇతర ప్రాంతాల పేర్లు చెపుతుండటంతో అవాక్కయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ శిక్షణ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి ఈ దోపిడీని అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిల్లలూ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోండి!

'ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని బాగా చదువుకొని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చట్టాన్ని గౌరవిస్తూ సమాజంలో మెలగాలి' అంటూ జిల్లా పోలీస్ యంత్రాంగం విద్యార్థులకు దిశానిర్దేశం చేసింది. శుక్రవారం జిల్లావ్యా ప్తంగా అన్ని విద్యాసంస్థల్లో పోలీస్ అధికారులు సమావేశమై మాట్లాడారు.



వింజమూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ వెంకటనారాయణ

ప్రభుత్వ భూములు బినామీల చేతుల్లో 6

ధర చూసి సంబరపడమాకు!

- గత ఏడాదికన్నా రెట్టింపుస్థాయిలో పొగాకు సాగు
- బోర్డు అధికారులు, వ్యాపారుల్లో ఆందోళన
- ధర పతనం తప్పదంటూ హెచ్చరికలు



గత రెండేళ్లలో అనూహ్యంగా పొగాకుకు లభించిన గిట్టుబాటు ధరతో రైతులు ఈ ఏడాది వేలంవెర్రిగా పొగాకు సాగుకు ఉపక్రమిస్తున్నారు. దీంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతుందని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ పరిణామాలు, మార్కెట్ స్థితిగతులను అంచనా వేస్తూ పొగాకు సాగు తగ్గించకుంటే నష్టపోతారని బోర్డు అధికారులు హెచ్చరిస్తున్నా రైతులు పట్టించుకోవడం లేదు. ఎన్నడూ లేనివిధంగా ఇండియన్ టుబాకో అసోసియేషన్ ద్వారా వ్యాపారులు కూడా సాగు విస్తీర్ణం తగ్గించాలని కోరుతున్నా ప్రయోజనం కనిపించడం లేదు.

6



రాజరాజేశ్వరికి ప్రత్యేక అలంకారం

దీప జ్యోతి నమోస్తుతే!

మూలస్థానేశ్వరాలయంలో లక్ష దీపోత్సవం

కార్తీక శుక్రవారం సందర్భంగా నెల్లూరులోని మూలస్థానేశ్వరాలయంలో లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో పుష్పాలతో వివిధ ఆకృతులు రూపొందించి వాటిలో దీపాలు వెలిగించారు. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. ఆలయ ఈవో జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కాగా, నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలోనూ విశేష పూజలు జరిగాయి. సుందరేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి రాహుకాల పూజల్లో భారీగా మహిళలు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తి అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. మహిళా బృందాల కోలాటం ఆకట్టుకుంది. రాత్రి కుంభహారతులు, పల్లకీ సేవ జరిగాయి. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, ఈవో, సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



మూలస్థానేశ్వర ఆలయంలో దీపాలు అమరుస్తున్న భక్తులు

ఇక్కడ కాసేపు నుంచుంటే అంతే..

అయ్యవారిపల్లె సమీపంలోని నేషనల్‌హైవే రోడ్డుపై వాహనాలు వెళ్లిన ప్రతిసారీ దుమ్ము విపరీతంగా లేస్తుంది. ఇక్కడ కాసేపు కూడా నిల్చుంటే అంతే సంగతులు అని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు వేసినపుడు వాటర్ క్యూరింగ్ చేయకపోవడం వలన ఈ సమస్య ఉందని చెబుతున్నారు. రోడ్డు పక్కన ఇళ్లు ఉన్నవారు ఈ దుమ్ముతో రోజూ ఎలా జీవనం సాగిస్తారో వారికే తెలియాలి.

- వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి)



ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకూడదు

● డీఏవో సత్యవాణి

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు సకాలంలో ఇవ్వడంతో పాటు వారికి అవసరమైన ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) పీ సత్యవాణి గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఇందుకూరుపేట, నెల్లూరు, కోవూరు, పొదలకూరు సబ్ డివిజన్ల పరిధిలోని వీఏఏలకు ప్రభుత్వ పథకాల పై అవగాహనకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. డీఏవో మాట్లాడుతూ ప్రతి సర్వే నెంబరును ప్రత్యక్షంగా సందర్శించి పంట నమోదు చేయాలని, ఈవిషయంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. ఆత్మ పీడీ శివ న్నారాయణ మాట్లాడుతూ రైతులకు మట్టినమూనాల ఫలితాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఏవో కార్యాలయ ఏడీఏలు నర్సోజి, శేషగిరిరావు, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు వినీత, శ్రీలక్ష్మి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి పక్కన ఆత్మ పీడీ, ఏడీఏలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆడిట్

ఉదయగిరి రూరల్, నవంబరు 22(ఆంధ్ర జ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఆడిటర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సీహెచ్ హరివర్మ, ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ శ్రీరామ్మూర్తి ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఇప్పటివరకు జరిగిన క్రయ, విక్రయాలకు సంబంధించిన డాక్యుమెంట్లను నిశితంగా పరిశీలించారు. సాధారణ ఆడిట్‌లో భాగంగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించామన్నారు. ప్రజలు క్రయ, విక్రయాలకు సంబంధించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సీనియర్ సహాయకులు రమేష్‌బాబు, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ కృష్ణచైతన్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న హరివర్మ

కావలిలో యువకుడి అనుమానాస్పద మృతి

కావలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో ముప్పవరపు శాంతకుమార్ (35) అనే యువకుడు శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ముసునూరు అట్టలఫ్యాక్టరీ కాలనీకి చెందిన శాంతకుమార్‌కు, తుఫాన్‌నగర్‌కు చెందిన సంతోషితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే, ఏడాది కాలంగా దంపతులు వేర్వేరుగా ఉంటున్నారు. సెంట్రింగ్ పనులు చేసుకుంటూ తల్లి వద్దనే ఉంటున్న శాంతకుమార్‌కు అదే కాలనీలోని ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. ఆమెతో కలిసి శుక్రవారం సాయంత్రం జగనన్న కాలనీలోని ఒక ఇంటి వద్దకు శాంతకుమార్ వెళ్లాడు. కొంతసేపటి తరువాత ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో రత్నకుమారి అక్కడ నుంచి కొంతదూరం వెళ్లి తిరిగి రాగా, అప్పటికే శాంతకుమార్ కిటికీకి ఉరి వేసుకుని ఉండటాన్ని గుర్తించింది. వెంటనే స్థానికులకు సమాచారం ఇవ్వడంతో విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీధర్, సీఐ రాజేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్‌ఐలు తిరుమలరెడ్డి, బాజిబాబులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేశ్వరరావు తెలిపారు.

'సోమశిల'లో 70.913 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 5,000 ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.913 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,050, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 2100, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● రాపూరు : కండలేరు జలాశయంలో నీటిమట్టం 52 టీఎంసీలకు చేరుకున్నట్లు డ్యాం ఏఈ తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.



తెలుగువారి వారసత్వ సంపద అయిన కూచిపూడి నృత్యానికే వన్నె తెస్తోంది నెల్లూరుకు చెందిన నృత్యకారిణి చెన్నారెడ్డి శరణ్యారెడ్డి. గజ్జెకట్టి వేదికపై నృత్యం చేస్తే చాలు ప్రశంసల వర్షం కురవడంతోపాటు అవార్డులు అందుకోవాల్సిందే. దేశవ్యాప్తంగా రెండు వేలకుపైగా ప్రదర్శనలు ఇచ్చిన శరణ్యా రెడ్డి ఎన్నో బంగారు పతకాలు అందుకుంది. అంతేకాదండోయ్.. పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలిచి గురువులకు కూడా 'ఆహా.. ఏమి నృత్యం' అనిపిస్తోంది.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

గజ్జె ఘల్లుమన్నదో.. గుండె జల్లుమన్నదో!

- 'కూచిపూడికే వన్నె తెస్తున్న శరణ్యారెడ్డి
- 2 వేలకుపైగా ప్రదర్శనలు
- జాతీయస్థాయిలో అవార్డులు, ప్రశంసాపత్రాలు
- ఈమె స్ఫూర్తిగా తల్లి, చెల్లి కూడా నృత్యంలో రాణింపు

నెల్లూరులోని వేదాయపాళెంకు చెందిన బాలశ్రీకర్‌రెడ్డి, జ్యోత్స్నల కుమార్తె శరణ్యారెడ్డి బుడిబుడి నడకల ప్రాయంలోనే టీవీలోని శాస్త్రీయ నృత్యాలను చూసి అదే నృత్యాన్ని పర్ఫెక్ట్‌గా ప్రదర్శించడాన్ని గుర్తించారు. నాట్యంపై కుమార్తెకు ఉన్న మక్కువను గుర్తించిన తల్లిదండ్రులు నగరంలోని ఫత్తేఖాన్ పేటలో ఉంటున్న డేగా సాంబశివరావు నృత్య పాఠశాలలో శిక్షణకు చేర్పించారు. శరణ్యారెడ్డిలోని చురుకుదనం, పాదాల కదలిక, భంగిమలను గుర్తించిన సాంబశివరావు ఆమెను కూచిపూడి నృత్యకారిణిగా మలిచారు. ఎనిమిదవ యేటనే నృత్య ప్రదర్శనకు ఆరంగేట్రం చేసిన ఆమె అందరినోట శభాష్ అనిపించుకుంది.

● కూచిపూడి నృత్యంలోని భామాకలాపం, రాజదరువు, కీలికలు తరంగాలు, కీర్తనలో పదాలు, పంచరత్న కీర్తనలు, జావాళీ, నృత్య రూపకాలు, యక్షగానాలు తదితర విభాగాల్లోనూ తన ప్రతిభను ప్రదర్శిస్తోంది. భామా కలాపంలో సత్యభామగా, బాణాసురుడు వంటి మగ పాత్రలోనూ అలవోకగా కూచిపూడి నృత్యం చేయడంలో ఆమెకు ఆమె సాటి. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, కేరళా, న్యూఢిల్లీ, వారణాసి వంటి ప్రాంతాల్లో రెండువేలకుపైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. విశ్వవేదికలపై కూడా కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చి తెలుగు కళ కూచిపూడి నృత్యానికి తనవంతుగా వన్నె తేవాలని నిరంతరం ఆ నృత్య మెలకువలపై సాధన చేస్తోంది. ఎన్నో పోటీలు, ప్రదర్శనలలో పారితోషకాలు, ప్రశంసా పత్రాలు, బంగారు పతకాలు, జ్ఞాపికలు అందుకున్న శరణ్యారెడ్డి నాట్య రంజిత, యువరత్న తదితర అవార్డులతో పాటు మరో 20 అవార్డులు కొవసం చేసుకున్నరు.

● **అమ్మ, చెల్లి కూడా..**

కుమార్తె శరణ్యారెడ్డిని నృత్య పాఠశాలకు తీసుకువెళుతున్న తల్లి జ్యోత్స్నరెడ్డికి కూడా కూచిపూడి నృత్యం పట్ల ఆసక్తి పెరిగింది. నృత్య గురువుల సలహా మేరకు ఆమె కూడా నృత్యం నేర్చుకుని కూతురితో కలిసి వేదికలపై ప్రదర్శనలు చేస్తూ ప్రశంసలు అందుకున్నారు. తల్లి, అక్క శరణ్యారెడ్డి కూచిపూడి నృత్యకారిణిలుగా రాణించడంతో ప్రేరణ కలిగిన చెల్లెలు పర్ణికారెడ్డి కూడా కూచిపూడి నృత్యకారాణిగా రాణిస్తున్నారు. ఒకే ఇంటిలో తల్లి, ఇద్దరు కూతుళ్లు నృత్యకారిణులుగా రాణించడం అరుదైన సంఘటన.



ఒకే వేదికపై నృత్యరూపకం అనంతరం తల్లి జ్యోత్స్న, చెల్లి పర్ణికతో శరణ్యారెడ్డి

ఎంఏ, పీహెచ్‌డీ చేస్తా

కూచిపూడి నృత్యం నేర్చుకుంటే అందం, ఆరోగ్యం, మెరుపులు వస్తాయి. దీనికి సారూప్యంగా ఫిజియోథెరపి ఉంది. అందుకే కూచిపూడిలో డిప్లమో చేసిన నేను, నారాయణ వైద్య కళాశాలలో ఫిజియోథెరపి కోర్సు చేస్తున్నా. ఆ తర్వాత కూచిపూడిలో ఎంఏ, పీహెచ్‌డీ చేయాలన్నదే నా గోల్. అలాగే కూచిపూడి నృత్యంలో మేటి కళాకారిణిగా ఎదిగి రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రశంసా అవార్డు అందుకోవాలన్నదే నా సంకల్పం. అలాగే ఫిజియోథెరపీని జోడించి కూచిపూడి నృత్యంలో సరికొత్త నృత్యరూపకం సృష్టించాలని భావిస్తున్నా.

- చెన్నారెడ్డి శరణ్యారెడ్డి, నెల్లూరు.



న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ కళాకారుల సదస్సులో నటి హేమమాలిని ఇతర ప్రముఖులతో..

PRATIBHA

ధర చూసి సంబరపడమాకు!

- గత ఏడాదికన్నా రెట్టింపుస్థాయిలో పొగాకు సాగు
- రూ.5వేలు పలుకుతున్న మూట పొగనారు ధర
- బోర్డు అధికారులు, వ్యాపారుల్లో ఆందోళన
- ధర పతనం తప్పదంటూ హెచ్చరికలు
- అయినా మేల్కొనని సాగుదారులు



కందుకూరు ప్రాంతంలో పొగనాట్లు వేస్తున్న కూలీలు

కందుకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కరోనా కారణంగా పలు దేశాలలో పొగాకు సాగు తగ్గడం, అంతర్జాతీయంగా సిగరెట్ ఉత్పత్తిదారుల వద్ద నిల్వలు తగ్గటం తదితర కారణాలతో గత రెండేళ్లలో పొగాకుకు డిమాండ్ వచ్చి ధరలు అనూహ్యంగా పెరిగాయి. అయితే ఈ ఏడాది జింబాబ్వే, బ్రెజిల్‌లలో పొగాకు ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో అక్కడ భారీగా దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇందులో భాగంగానే కర్నాటక మార్కెట్లోనే ధరలు నేలచూపులు చూస్తున్నాయి. గత సీజన్‌లో మన రాష్ట్రంలో క్వింటాల్‌కు రూ.35వేల వరకు ధర లభించగా లో గ్రేడ్‌లకు కూడా 25వేల పైన ధర దక్కింది. అలాంటిది ప్రస్తుతం కర్ణాటకలో క్వింటాల్‌కు అత్యధిక ధర రూ. 29వేలు మాత్రమే నమోదవుతుండగా అది కూడా కొన్ని బేళ్లకు మాత్రమే వేస్తూ మిగిలిన నాణ్యమైన పొగాకుకు సరాసరిన రూ. 25వేలకు మించి ధర ఇవ్వడం లేదు. ఇక లో గ్రేడ్‌లకు కనీస గిట్టుబాటు ధర కూడా రైతులకు లభించని దుస్థితి నెలకొంది. దీంతో కర్నాటకలో నిత్యం రైతుల ఆందోళనలతో వేలం ప్రక్రియ సజావుగా సాగడం లేదు. సాధారణంగా ఆంధ్రప్రదేశ్‌లో ధరలతో పోలిస్తే కర్ణాటకలో క్వింటాల్‌కు రూ.5వేలు వరకు ధర అధికంగా ఉంటుంది. ఈ స్థితిలో రానున్న సీజన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో క్వింటాల్‌కు అత్యధిక ధర రూ.25వేలకు మించకపోవచ్చు. లో గ్రేడ్‌లకు అయితే అసలు ధరలు లభించే అవకాశమే లేదని ఇటు బోర్డు అధికారులు, అటు వ్యాపార ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. పొలం కౌలు, బ్యారన్‌లు రికార్డు ధరలకు తీసుకున్న రైతులు ఇక చేసేది లేక పొగాకు వేస్తున్న పరిస్థితి. అధికంగా పొగాకు పండిస్తే తప్ప బ్యారన్ లీజులు గిట్టుబాటు కావన్నది రైతుల ఆలోచన కాగా పంట దిగుబడి పెరిగితే ధరలు పూర్తిగా దిగజారిపోతాయన్నది వ్యాపారుల ఆలోచన. దీంతో పొగనారుకు డిమాండ్ పెరిగి మూట నారు రూ.4వేల నుంచి 5వేలకు పలుకుతోంది. కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాల పరిధిలో ఇప్పటికే 25వేల ఎకరాలకుపైగా పొగనాట్లు పూర్తయ్యాయని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. బోర్డు అనుమతించిన విస్తీర్ణం కన్నా రెట్టింపు విస్తీర్ణంలో వర్జీనియా, ఆ తర్వాత బర్లీ రకం పొగాకు సాగు చేస్తున్నారు. ఈ స్థితిలో రానున్న సీజన్‌లో పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా రైతులు పరిమితి మేరకే పొగాకు సాగుచేసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడం మంచిదని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చోరీ దొంగల అరెస్టు

● 110 గ్రాముల బంగారం, కిలో వెండి, మోటారు సైకిల్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ మంగారావు

కందుకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలం లో పలు చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలను పక్కా సమాచారంతో కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం, గుడ్లూరు సీఐ మంగారావుల పర్యవేక్షణలో వలేటివారిపాలెం ఎస్‌ఐ మరిడినాయుడు పట్టుకు న్నారు. శుక్రవారం సాయం త్రం స్థానిక సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయంలో డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కేసుల వివరాలను వెల్లడించారు. పాత నేరస్థులు గుంటూరు శారదా కాలనీకి చెందిన చిల్లర భిక్షాలు, కావలి బాలకృష్ణారెడ్డి నగర్‌కు చెందిన సయ్యద్ ఫయాజ్‌లు వలేటివారిపాలెం మండలంలో పలు దొంగతనాలకు పాల్ప డ్డారు. ఈ నెల 7న అయ్యవారిపల్లిలో మద్దులూరి ప్రభాకర్ కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి పొలం వెళ్లి ఉన్న సమయంలో పట్టపగలే స్క్రూ డ్రైవర్ సాయంతో ఇంటి తలుపు, బీరువా తాళం తీసి 89గ్రాముల బంగారు ఆభరణాలను తీసుకొని మోటారుసైకిల్‌పై పరారయ్యారు. కేసు విచారణలో లభించిన ఆధారాల మేరకు దొంగలు పాత నేరస్థులే అని గుర్తించి వారికోసం గాలిస్తుండగా మరో దొంగతనం కోసం పథకం వేసుకుని వస్తున్న వారిద్దరూ మాలకొండ సమీపంలో మొగిలిచర్ల క్రాస్ రోడ్డు వద్ద పట్టుబడ్డారు. దీంతో వారిని విచారించగా జూన్‌లో బడేవారిపాలెంలో పొడపాటి రమణమ్మ ఇంట్లో చేసిన దొంగతనాన్ని, తెలంగాణ రాష్ట్రంలో భద్రాచలం కొత్తగూడెం జిల్లా గుండాల పోలీస్‌స్టేషన్ ఇలాకాలో ఒక బంగారం షాపులో చేసిన దొంగతనాన్ని కూడా అంగీకరించారు. దీంతో వారి వద్ద 110గ్రాముల బంగారం, కిలో వెండిని దొంగతనాల కోసం వారు ఉపయోగిస్తున్న యమహా ఎఫ్‌జెడ్ ఎస్ మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో సీఐ మంగారావు, ఎస్‌ఐ మరిడినాయుడుతో పాటు కానిస్టేబుళ్లు జె.మునికృష్ణ, ఎన్.కిషోర్, బిమహేంద్రలు పాల్గొన్నారు. వీరిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

హోంగార్డ్స్ డీఎస్పీగా రమణ

● ఆర్‌ఐ థామస్ రెడ్డికి డీఎస్పీగా ఉద్యోగోన్నతి

నెల్లూరు(క్రైం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖలోని ఆక్టోపస్ విభాగంలో ఉన్న ఎన్‌వీ రమణ నెల్లూరు హోంగార్డ్స్ డీఎస్పీగా నియమితుల య్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 మంది ఏఆర్ డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా నెల్లూరు హోంగార్డ్స్ డీఎస్పీగా పని చేస్తున్న కే సుంకరయ్య ఆక్టోపస్‌కు బదిలీ కాగా, అక్కడ ఉన్న ఎన్‌వీ రమణను నెల్లూరు హోంగార్డ్స్ డీఎస్పీగా బదిలీ చేశారు. కాగా, నెల్లూరు ఆర్‌ఐ థామస్ రెడ్డి డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది పార్వతీపురం మన్యం జిల్లా ఏఆర్ డీఎస్పీగా నియమితులయ్యారు.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

నెల్లూరు (లీగల్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లారీలో ప్రయాణిస్తున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన పప్పర్తి సుబ్బారాయుడు అనే నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు ఇరవై రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2020 మే 19వ తేదీ రాత్రి ఆత్మకూరు సమీపంలోని నెల్లూరుపాళెంలో బాలిక, ఆమె మావయ్య కలిసి సుబ్బారాయుడు లారీ ఎక్కారు. సంగం వద్ద టిఫిన్ సాకుతో బాలిక మావయ్యను లారీ నుంచి దించిన నిందితుడు ఆ తర్వాత బాలికను తీసుకుని లారీలో కృష్ణపట్నం వైపు వేగంగా వెళ్లాడు. ఆ తర్వాత బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదుతో సంగం పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

తుప్పునకు ఐదేళ్లు !



శిథిలావస్థకు చేరిన మినీలారీలు



రిపేరుకు నోచుకోని కంప్యాక్టర్

ఇక్కడ కనిపిస్తున్న వాహనాలన్నీ చాలా ఖరీదైనవి. 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా వీటిని కొనుగోలు చేసింది. ప్రయోగా త్మకంగా రాష్ట్రంలోనే ప్రత్యేకించి నెల్లూరులో వీటిని వినియోగించింది. మినీలారీలు, కంప్యా క్టర్లు, మినీ ఆటోలు, జెట్టాయిలు, రోడ్డు ఊడ్చే యంత్రాలు ఇలా అనేక వాహనాలను కొను గోలు చేసి పారిశు ద్ధ్యంలో యంత్రపాల నకు శ్రీకారం చుట్టింది. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత వీటి పక్కన పడేశారు. చిన్నిచిన్న రిపేర్లే ఉన్నప్పటికీ పట్టించుకో లేదు. గడిచిన ఐదేళ్ల నిర్లక్ష్యానికి గురవ డంతో రూ.కోట్ల విలువ చేసే యంత్రాలు, వాహనాలు తుప్పుపట్టి ఇదిగో ఇలా పాతమున్సిపల్ కార్యాలయ ప్రాంగణం లో శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిలో కొన్ని చోరీకి గురయ్యాయి.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)



మూలనపడ్డ జెట్టాయిలు

రూ.6 కోట్ల పనుల్లో 7 లక్షల అవినీతి

- ప్రజావేదికలో తేల్చిన 'ఉపాధి' అధికారులు
- అవినీతిపై విజిలెన్సు విచారణ : డ్వామా పీడీ



పీడీకి ఫిర్యాదు చేస్తున్న వీరంపల్లి గ్రామస్థులు

మనుబోలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ.6 కోట్లతో చేపట్టిన పనుల్లో రూ.7లక్షల అవినీతి జరిగిందని సంబంధిత శాఖ అధికారులు సామాజిక తనిఖీల్లో గుర్తించారు. ఈ వివరాలను శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు వెల్లడిం చారు. డ్వామా పీడీ గంగాభవాని ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రజావేదికలో సామాజిక తనిఖీ నివేదికలను పంచాయతీల వారీగా డీఆర్‌పీలు చదివి వినిపించారు. ప్రతి పంచాయతీ నివేదిక చదివినప్పుడల్లా సదరు గ్రామస్థులు క్షేత్ర, సాంకేతిక సహాయకులపై ఫిర్యాదులు చేశారు. ప్రధానంగా వీరంపల్లి గ్రామస్థులు తమ గ్రామంలో రూ.లక్షల్లో అవినీతి జరిగిందని, గిరిజనులు, దళితుల సొమ్ము తినేశారంటూ పీడీ ఎదుట రచ్చ చేశారు. అలాగే కొలనుకుదురు గ్రామంలోనూ అవినీతి జరిగిందంటూ టీడీపీ నాయకులు రభస చేశారు. ప్రజావేదిక పూర్తయిన తరువాత పీడీ మాట్లాడుతూ మండలంలో ఉపాధి పథకం కింద రూ. 6కోట్ల పనులు జరిగగా అందులో అన్ని పంచాయతీల్లో కలిపి రూ.7.25 లక్షల మేర అవినీతి జరిగినట్లు గుర్తించామన్నారు. ఒక్క వీరంపల్లి పంచాయ తీలోనే రూ.5లక్షల అవినీతి జరిగిందన్నారు. దీనిపై మళ్లీ విజిలెన్సు విచారణ చేపడతా మని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, దుర్వినియోగం అయిన సొమ్ము రికవరీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీబీటీ ఎన్‌ఏ నాయుడు, డీవీవో విజయలక్ష్మి, ఏపీడీ శంకర్ నారాయణ, ఎస్‌పీసీవో సతీష్‌బాబు, అంబుడ్స్‌మన్ వెంకటరెడ్డి, ఎంపీపీ వజ్రమ్మ, ఎంపీడీవో జలజాక్షి, ఏపీవో రాజమ్మ, ఈసీ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ కృష్ణకాంత్
- విద్యా సంస్థల్లో పోలీసుల అవగాహన సదస్సులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు పిల్లల విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ సూచించారు. నెల్లూరులోని డీకేడబ్ల్యూ, గీతాంజలి ఇంజనీరింగ్, నారాయణ ఇంజనీరింగ్ కళాశాలల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల అవగాహన కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, చట్టాలపై జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని బాగా చదువుకోవాలని సూచించారు. తెలిసిన వారు, బంధువుల ద్వారానే పిల్లలపై ఎక్కువగా నేరాలు జరుగుతున్నాయని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు అమ్మినా, రవాణా చేసినా, సేవించినా కేసులు నమోదు అవుతాయన్నారు. ఒక్కసారి డ్రగ్స్ కేసులో పట్టుపడితే ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేరని, పాస్‌పోర్టు, వీసా వంటివి రావని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

శంకర మఠం చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నెల్లూరు(క్రైం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మూలాపేటలోని శంకర మఠంలో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను చిన్నబజారు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వెల్లడించారు. ఈ నెల 19వతేదీ అర్ధరాత్రి మఠంలోకి గుర్తు తెలియని దుండడుగు ప్రవేశించి సుబ్రహ్మణ్య స్వామి శూలం, ఆకాశ దీపం, పంచలోహ కలిశాలు, నగదు పెట్టె, ఫోకస్ లైట్లను దోచుకెళ్లాడు. మఠం మేనేజర్ ఉషా కుమారి ఫిర్యాదు మేరకు చిన్న బజారు పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుడిని శెట్టిగుంట రోడ్డుకు చెందిన బీ రవీంద్రగా గుర్తించి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొలగమూడి క్రాస్ రోడ్డు, వెంకటాచలం సమీపంలోని ఇందిరమ్మకాలనీ ప్రాంతాల్లో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. గూడూరు నుంచి నెల్లూరు వైపు ఒకే మార్గంలో రెండు లారీలు వెళుతున్నాయి. గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు స్వల్పంగా గాయపడగా మిగిలిన వారు క్షేమంగా బయటపడ్డారు. వెనుక లారీ ముందు భాగం దెబ్బతిని అద్దం పూర్తిగా పగిలిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్‌కు చెందిన వెంకటేశ్వర్లు మండలంలోని పంటపాళెం సమీపంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా ఇందిరమ్మకాలనీ సమీపంలో వెంకటాచలం రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న మలుపు వద్ద షడన్‌గా ఆటో ఎదురురావడంతో దానిని తప్పించుకునే క్రమంలో మోటార్ బైక్ అదుపు తప్పి బోల్తాపడి గాయపడ్డారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	97
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	180
స్కిన్‌లెస్	200
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7459
వెండి కిలో ధర	రూ. 93,200
వెండి ఒక గ్రాము	రూ.96.20

విద్యుదాఘాతంతో రైతు మృతి

కావలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మోర్లవారిపాలెంకు చెందిన కట్టా ప్రభాకర్ (35) అను రైతు శుక్రవారం వ్యవసాయ పొలంలో విద్యుదాఘాతానికి గురై మరణించాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. పొలం వద్ద విద్యుత్ మోటారు వేసేందుకు ఉదయం వెళ్లాడు. కరెంటు సరఫరా కాకపోవడంతో ఫీజులు వేసేందుకు ట్రాన్స్‌ఫారం వద్దకు వెళ్లాడు. అక్కడ ఫీజులు వేస్తుండగా షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ విషయాన్ని గుర్తించిన సమీప పొలాల్లోని రైతులు ప్రభాకర్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అతన్ని పట్టణంలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య దేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుమల రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ భూములు బినామీల చేతుల్లో

- వైసీపీ హయాంలో రికార్డుల తారుమారు
- వంద ఎకరాల వరకు ఆక్రమణ
- సమాచార హక్కు చట్టం ద్వారా వివరాల సేకరణ
- తమకు న్యాయం చేయాలంటున్న బాధితులు



ఈమె పేరు మన్నెం మంజుల. కనీసం సెంటు భూమి కూడా లేకపోవడంతో 22 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న సర్వే నెం. 137-1లోని 1.30 ఎకరాలను తల్లిదండ్రులు ఆమెకు అప్పగించారు. అప్పటి నుంచి ఆ భూమిపైనే మంజుల ఆధారపడి జీవిస్తోంది. అయితే, రాజకీయ దురుద్దేశంతో ఆ భూమిని కొంతమంది ఆక్రమించుకొని పట్టాలు పొందారు. తమకు జరిగిన అన్యాయంపై బాధిత కుటుంబం అధికారులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది.

గత వైసీపీ హయాంలో కొంతమంది నాయకులు రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి బినామీ పేర్లతో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొన్న సంఘటన మండల పరిధిలోని దక్కనూరు లో వెలుగు చూసింది. అప్పట్లో అధికార పార్టీకి తలొగ్గిన అధికారులు గ్రామంలో సెంటు భూమి లేని నిరుపేదలను ఏమాత్రం పట్టించుకోకుండా సెంటిల్‌మెంటు భూములు ఉన్నవారికే తిరిగి ప్రభుత్వ భూములు మంజూరు చేయడం చర్చనీయాంశంగా మారింది. గ్రామంలోని కొంతమంది సహచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకోవడంతో ఈ బాగోతం బట్టబయలయ్యింది.



ఆక్రమిత భూమిలో సాగు చేస్తున్న బత్తాయి చెట్లు

వరికుంటపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దక్క నూరులోని సర్వే నెంబర్లు 138-3, 142-1, 137-1, 191-1, 191-3, 145-2, 145-4, 175, 228, 229-1, 238-8, 247-2, 289, 137, 182, 206, 210-2ఏ, 215-1 తదితర సర్వే నంబర్లలో సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది బినామీ పేర్లతో పట్టాలు పొందారు. సదరు భూముల్లో బత్తాయి, జామాయిల్ సాగు చేసుకుంటుండగా మరికొంతమంది తమ ఆధీనంలోనే ఉంచుకున్నారు. పేదవారికి సెంటుభూమి ఇచ్చేందుకు సవాలక్ష నిబంధనలు విధించే అధికారులు అప్పట్లో అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి బినామీ పేర్లను రికార్డుల్లో నమోదు చేయడం ఒక వంతైతే, ఒకే వ్యక్తి పేరుతో రెండు పట్టాలు కూడా మంజూరు చేశారంటే వారి పనితీరు ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతోంది. అలాంటి బినామీ పట్టాలు రద్దు చేసి అర్హులకు న్యాయం చేయాలని కొంతమంది గ్రామస్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసి వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిం ది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపడితే మరిన్ని సర్వే నెంబర్లలోని మరింత భూ ఆక్రమణ వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

రికార్డుల్లో తారుమారు

2019లో అప్పటి తహసీల్దారు కొంతమంది పట్టాలు రద్దు చేస్తున్నట్లు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారు. అయినా వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో అదే అదునుగా ఆక్రమణదారులు తిరిగి 2020లో తమ పేర్లను మరోమారు రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. ఆ నివేదికల్లోనూ భూముల విస్తీర్ణం, తదితర అంశాలను ఒక్కో అధికారి ఒక్కో రకంగా రికార్డుల్లో నమోదు చేశారు. ఈ తతంగాన్ని ఇటీవల గ్రామస్థులు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు తెలిసింది. ఆ తర్వాత కందుకూరు సబ్‌కలెక్టర్ గ్రామంలో విచారణ చేపట్టినా సమగ్ర సమాచారాన్ని కొంతమంది అధికారులు గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

పాతకక్షలతో దాడి

నెల్లూరు(క్రైం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులపై దాడి చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని జెండావీధికి చెందిన షేక్ ముజమిల్, మన్సూర్‌నగర్‌కు చెందిన కత్తి శివ స్నేహితులు. శివకు అదే ప్రాంతానికి చెందిన రాహుల్, కార్తీక్‌తో రెండేళ్ల కిందట గొడవలు జరిగాయి. అప్పటి నుంచి వారి మధ్య కక్షలున్నాయి. ఈ నెల 20వ తేదీ ముజమిల్, శివ మన్సూర్‌నగర్‌లోని ఓ చిల్లర దుకాణం మెట్లపై కూర్చొని ఉండగా రాహుల్, కార్తీక్, సంతోష్, సన్నీ, మరికొందరు కలిసి రాళ్లు, కర్రలు, కత్తులతో దాడి చేశారు. గాయపడ్డ ముజమిల్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదుతో శుక్రవారం చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం దుకాణంపై...

నగరంలోని పరమేశ్వరి నగర్ వాకర్స్ రోడ్డులోని లక్కీ వైన్స్ షాప్‌పై జాకీర్ అనే వ్యక్తి దాడి చేశారని ఆ దుకాణం క్యాషియర్ శ్రీనివాసులు శుక్రవారం చిన్న బజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తి దుకాణానికి వచ్చి సిబ్బందిని బూతులు తిడుతూ షట్టర్‌ను రెండు, మూడు సార్లు మూసేందుకు ప్రయత్నించాడని, కౌంటర్ టేబుల్‌ను బలవంతంగా నెట్టి వేయడంతో పలు మద్యం సీసాలు ధ్వంసమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణిత శాస్త్రవేత్త సంజీవరాయశర్మ జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు లక్కాజు సంజీవరాయ శర్మ జయంతిని శుక్రవారం ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్‌లో మురిగిపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో ఆరు గణిత అవధానాలు చేసిన వ్యక్తి సంజీవరాయశర్మని కొనియాడారు. పుట్టుకతోనే అంధుడైన శర్మ ఏడు వేలకుపైగా ప్రదర్శనలిచ్చారని, 4వేల సంవత్సరం భారతీయ క్యాలెండరును అప్పట్లోనే రూపొందించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సంజీవరాయశర్మకు ఘనంగా నివాళులు అర్పించారు.

డిగ్రీ పరీక్షలకు ఒకరు గైర్హాజరు

వెంకటాచలం, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలకు 24 మంది విద్యార్థులకు గాను 23 మంది ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు వీఎస్ యూ పరీక్షల నిర్వాహణాధికారిణీ డాక్టర్ ఆర్ మధు మతి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ



డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ లో అద్దె బస్సులకు, తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న డ్రైవర్లకు శుక్ర వారం కాకు టూరులోని ఆర్టీసీ జోనల్ శిక్షణ కార్యాల యంలో రెండు రోజుల ట్రైనింగ్ ప్రారం భమైంది. ముఖ్య అతిథిగా జోనల్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు హాజరయ్యారు. రోడ్డు భద్రత, డ్రైవర్లు పాటించాల్సిన నియమాలు, ప్రమాదాల నివారణ, ప్రయాణికుల భద్రత, నడవడిక తదితరాలపై శిక్షణ ఇచ్చారు. నెల్లూరు జోన్ పరిధిలో 2వేల మంది అద్దె బస్సులకు, తాత్కాలిక డ్రైవర్లుగా పని చేస్తున్నారని, వారందరికీ డిసెంబరు 31లోగా శిక్షణ పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశామని ఈడీ తెలిపారు.

ప్రయాణికులకు ఆర్టీసీ మెరుగైన సేవలు

- ఆర్ఎం మురళీబాబు



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్ఎం మురళీబాబు

ఉదయగిరి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే ఆర్టీసీ ధ్యేయమని రీజనల్ మేనేజర్ మురళీబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలోని పలు విభాగాలను పరిశీలించారు. సంబంధిత రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆర్టీసీలో నూతనంగా సమయపాలన మాసోత్సవాలను ఈనెల 16 నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈపీకే తక్కువగా ఉన్న మార్గాల్లో గిఫ్ట్‌స్కీం ప్రవేశపెట్టామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ, హైయర్ బస్సు డ్రైవర్లకు జోనల్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. డ్రైవర్స్ హ్యాపీనెస్ వీక్‌ను నూతనంగా ప్రవేశపెట్టామన్నారు. ప్రతినెలా 1 నుంచి 7వ తేదీ వరకు డ్రైవర్లు సూచించిన సమస్యలను గ్యారేజీ సిబ్బంది 1, 2, 3వ తేదీల్లో రికార్డు చేసుకొని 4, 5, 6, 7వ తేదీల్లో పరిష్కరించి డ్రైవర్లకు తెలియచేస్తారన్నారు. కాగా, 60 ఏళ్లు నిండిన వృద్ధులకు ఆర్టీసీ బస్సుల్లో 25 శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు. గతంలో ఆధార్‌కార్డును ప్రామాణికంగా పరిగణించేవారని, ప్రస్తుతం పాస్‌పోర్టు, ఓటరుకార్డు, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, సీనియర్ సిటిజన్ ఐడీ కార్డులను కూడా అనుమతిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఐ నాగభూషణం, ఏడీసీ వెంకటేశ్వర్లు, జాఫర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ ఆనంద్



గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టరు ఆనంద్

విడవలూరు/కొడవలూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఆయన విడవలూరు మండలంలోని పార్లపల్లి గిరిజన కాలనీ, కొడవలూరు మండలంలోని నార్తురాజు పాలెంలో ఎస్టీకాలనీలో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న గిరిజనులకు ఆధార్‌కార్డులు, ఇళ్ల స్థలాలు లేవని, కొందరికి రేషన్‌కార్డులు లేక ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు అందడం లేదని, శ్మశాన స్థలం ఆక్రమణకు గురవడంతో మలిదేవి డ్రైయిన్ గట్లపై ఖననం చేయ్యాల్సి వస్తుందని పార్లపల్లి టీడీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ కలెక్టరుకు వివరించారు. తాగునీరు లేక కాలువ నీరు వాడుకుంటున్నారని, తదితర సమస్యలను స్వచంద సంస్థ నేత బషీర్ తెల్పడంతో రాజుపాలెం నుంచి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను తెలుసుకోనేందుకే కాలనీల్లో పర్యటిస్తున్నామని, వారికి ఆధార్, రేషన్‌కార్డులు, మరుగుదొడ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. శ్మశానానికి స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. టీడీపీ మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తువ్వార ప్రవీణ్ కలెక్టర్‌ను సన్మానించారు. కలెక్టరు వెంట హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పరిమళ, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, హౌసింగ్ డీఈ వెంకటేశ్వరరావు, తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో నగేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వారిని అరెస్టు చేయండి

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి



పోలీస్ స్టేషన్ వద్ద వైసీపీ నాయకులు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : వైసీపీ వారిపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వారిని అరెస్టు చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్య క్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నెల్లూరులోని వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో వైసీపీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో నారా లోకేష్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన అనేక మంది అసభ్యకర పోస్టులు చేశారని, కానీ ఏనాడు వారిని అరెస్టు చేయలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాజ్యాంగం అమలు కావడం లేదని, వైసీపీ వారికి ఒక న్యాయం, టీడీపీ వారికి మరో న్యాయంలా ఉందని విమర్శించారు. రోజులన్నీ ఒకేలా ఉండవని, వైసీపీ కార్యకర్తల్ని ఇబ్బంది పెడుతున్న వారెవరినీ వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణ మ్మ, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, రూరల్ నియోజ కవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై దాడి

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కొందరు దాడి చేసి అతని ఒంటిపై ఉన్న ఆరు సవర్ల బంగారు నగలు దోచుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. సంగం గ్రామానికి చెందిన శ్రీనివాస మోహన్ గూడూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన పిన్ని నెల్లూరు మూలాపేటలో నివసిస్తున్నారు. గురువారం సాయంత్రం శ్రీనివాస మోహన్ పిన్ని ఇంటికి నడిచి వెళుతుండగా రెండు బైక్‌లపై ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అడ్డుకున్నారు. దాడి చేసి బంగారు గొలు సు, బ్రాసిలైట్లను దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

ప్లాటు అమ్మబడును

నెల్లూరు వావిలేటిపాడు సత్యంజీనగర్ నందు 33 అం.. ప్లాటు అమ్మబడును. (అంకణం 65 వేలు పడమర ఫేస్) సం.ప్ర. సెల్: 91825 78766

AJR-193590

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

దోమలకు ఆవాసాలు.. ఖాళీ స్థలాలు

● ప్రబలుతున్న వ్యాధులు ● పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షపునీరు చేరి దోమలకు ఆవాసాలుగా మారి వ్యాధులకు గురికావల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని జెఆర్‌పేట, ఎల్‌ఆర్‌పల్లి, ఆర్టీసీ డిపో తదితర ప్రాంతాల్లో జనావాసాల మధ్య ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. పరిసర ప్రాంత ప్రజలు మురికినీరు అందులోకి వదులుతుండడంతో మురికికూపాలుగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. తాగేసిన కొబ్బరిబొండాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ సామగ్రి, పాత టైర్లు వంటివి ఖాళీ స్థలాల్లో పడేయడంతో వాటిలో వర్షపునీరు చేరి ప్రమాదకరమైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు కారణమయ్యే దోమలు పెరుగుతున్నాయి. అంతేగాక గుబురుగా పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగులకు ఆవాసాలుగా మారాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

కోర్టు ఆదేశాలు బేఖాతరు

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 23 వార్డులు ఉంటే ఖాళీస్థలాలు మాత్రం 700కు పైగా ఉన్నాయి. మున్సిపాలిటీ వారు అధికారికంగా 202 స్థలాలను గుర్తించారు. గుర్తింపులేని ఖాళీస్థలాలు మరో 510కి పైగా ఉన్నాయి. ఖాళీస్థలాలను చదును చేయించి పిచ్చిమొక్కలు మొలవకుండా, మురికినీరు నిల్వ ఉండకుండా, చెత్తాచెదారాలు ఖాళీస్థలాల్లో పడేయకుండా చూడాలని, అలా చేయని ఖాళీస్థలాల యజమానులకు రూ.1000 జరిమానా విధించాలని మున్సిపల్ అధికారులకు కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. దీంతో అధికారులు యజమానులకు నోటీసులు జారీచేసినా ఖాతరు చేయడంలేదు.



ఆత్మకూరు పట్టణంలో నివాసాల మధ్య ఖాళీస్థలాలు

ప్రబలుతున్న విషజ్వరాలు

దోమల కారక లార్వాలు ఖాళీస్థలాల్లోని మురికినీటిలో అలాగే ఉండిపోతున్నాయి. వాతావరణంలో మార్పులు రాగానే విజృంభిస్తున్నాయి. ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. జ్వరాలు వచ్చినప్పుడే హడావుడి చేసే వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం సహాయ నిధికి విరాళాలు అందజేత

విංజమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఉదయగిరి నియోజకవర్గంలోని దాతలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అందజేసిన రూ.20,03,655 ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి చెక్కుల రూపేణ అందజేశారు. వరద బాధితుల కష్టాలను తెలుసుకున్న సేవాభావం కలిగిన వివిధ ప్రాంతాల వారు నియోజకవర్గంలోని నాయకులు స్వచ్ఛందంగా ఎమ్మెల్యేకి చెక్కుల రూపంలో విరాళాలు అందజేశారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వెంగమాంబ ఆలయ అభివృద్ధికి చర్యలు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలోని శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ, దేవదాయ ధర్మదాయ శాఖ ఏఈ మురళీ పేర్కొన్నారు. శుక్రవారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, అర్చకులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయ అభివృద్ధికి పరిసరాలను పరిశీలించి ఆలయం కొలతలను సేకరించామన్నారు. ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామన్నారు. అనంతరం ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. నిధులు మంజూరు కాగానే భక్తులకు సౌకర్యవంతంగా అభివృద్ధి పనులు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మార్చినాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

● హౌసింగ్ ఈఈ దయాకర్

కలువాయి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవై-1 కింద చేపట్టిన పక్కాగృహాల నిర్మాణం వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తిచేయాలని గృహనిర్మాణ శాఖ ఈఈ దయాకర్ అన్నారు. శుక్రవారం ఆయన కలువాయి హౌసింగ్ కార్యాలయంలో సిబ్బంది, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేయించడంతో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు బయటపడింది. ఈనేపథ్యంలో లేఅవుట్‌లలో నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయని, వాటిని తిరిగి ప్రారంభించి 2025 మార్చి నాటికి పూర్తిచేయాలని కోరారు. ఇందుకోసం గృహనిర్మాణ శాఖ సిబ్బంది కాంట్రాక్టర్లతో కలసి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఆత్మకూరు డీఈ గౌస్‌మోహిద్దీన్ తదితరులు ఉన్నారు.


కాంట్రాక్టర్లతో సమావేశమైన హౌసింగ్ ఈఈ

200 రోజుల పని దినాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

ఉదయగిరి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు 200 రోజులు పని కల్పించడంతో పాటు దినసరి వేతనం రూ.800 చెల్లించాలని జిల్లా రైతు సంఘం నాయకుడు శ్రీరాములు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విరమించుకోవడంతోపాటు విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దుచేయాలన్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో వలసల నివారణకు పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయడంతోపాటు సీతారాంసాగర్ ప్రాజెక్టును నిర్మించాలన్నారు. ఉదయగిరి-నందవరం, ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26న చేపట్టే దేశవ్యాప్త ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, గడ్డం నాగేశ్వరరావు, షేక్ నాయబ్, వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై ముందస్తు అవగాహన ఉండాలి

● ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ దరియప్ప


మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ దరియప్ప

అల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించే సమయంలో అప్రమత్తంగా ఉండడంతో పాటు అవగాహన కలిగి ఉంటే వాటి నుంచి ఏర్పడే మరణాల సంఖ్యను తగ్గించవచ్చని ఎన్‌డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ఇన్‌స్పెక్టర్ దరియప్ప తెలిపారు. ఇస్కపల్లి పాలెం మత్స్యకారులకు శుక్రవారం స్థానిక రెవెన్యూ సిబ్బందితో కలసి ఆయన విపత్తులపై అవగాహన కల్పించారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోగలిగితే మరణాల సంఖ్యను తగ్గించవచ్చన్నారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, విపత్తుల సమయంలో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్, ఆర్ఐ ప్రభుదీప్, మెరైన్ సీఐ డి.ప్రసాద్, ఎస్ఐ నాయబ్‌రసూల్, వీఆర్వో మల్లికార్జున, పార్థసారథి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

మా క్లయింట్ **ముప్పాళ్ళ శ్రీనివాసరావు,** తండ్రి **శ్రీరాములు,** నరిశెట్టివారిపాలెం, కందుకూరు(మం), S.P.S.R.నెల్లూరు జిల్లా వారి సంజాయిషీ మేరకు ఇచ్చిన నోటీసు. **1. గోళ్ళమూడి రంజిత్‌కుమార్,** తండ్రి **కృష్ణప్రసాద్,** ఆధార్ నెం.5807 7946 4363, **2. శ్రీలత ముప్పాళ్ళ** తండ్రి శ్రీనివాసరావు ఆధార్ నెం. 9311 5441 2244 అను వారు **డాక్యుమెంట్ నెంబర్ 12160/2024,** క్రింద కందుకూరు గ్రామం నందలి సర్వే నెంబర్ 274/1A, 22వ వార్డు, రెండవ బ్లాకు 22-2-3A, అసెస్మెంట్ నెంబర్: 1033014653 హెచ్ఎస్‌సి : 19210, హెచ్ఎస్‌సి : 20129, హెచ్ఎస్‌సి: 20130, హెచ్ఎస్‌సి:20131లతో పవర్ కనెక్షన్లు గల ఇల్లు (ఆర్‌సిసి స్లాబ్) మరియు ఖాళీ స్థలమును కొనుగోలు చేసి అనగా **ముప్పాళ్ళ శ్రీనివాసరావు,** తండ్రి **శ్రీరాములు** నరిశెట్టివారిపాలెం పై ఆస్తి గురించి జిపిఏ, లింకు డాక్యుమెంట్లు మరియు ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇచ్చినారు. **తేది.20-09-2024**న లింకు డాక్యుమెంట్లలో ఒకటైన **692/2006** మా ఊరి నుండి ఆర్టీసీ బస్టాండ్ కందుకూరు దారిలో పోయినది. దొరికినవారు మొబైల్ నెంబర్ **9951161767**కు తెలియజేయగలరు.

ఇట్లు:
బి.సాయిశంకర్
అడ్వకేట్, కందుకూరు

గ్రామ విభజనపై అభ్యంతరాల స్వీకరణ


సమావేశంలో పాల్గొన్న అధికారులు

చేజర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటితీర్థం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న తూర్పు కంభంపాడును ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయుటకు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కోటితీర్థం గ్రామ విభజనపై తహసీల్దారు ఆర్ మస్తానయ్య, ఎంపీడీవో విజయలలిత ప్రజలతో చర్చించారు. అభ్యంతరాలు ఉంటే 25వ తేదీ నాటికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వినియోగిస్తే జైలుశిక్ష : సీఐ

ఆత్మకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వినియోగిస్తే ఆరు నెలల నుంచి ఏడాది పాటు, డ్రగ్స్ సంబంధిత నేరాలను ప్రోత్సహిస్తే 10నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించబడతాయని సీఐ జి గంగాధర్, డీఎస్పీ కె వేణుగోపాల్, ఎస్ఐ షేక్ జిలానీ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో సాంఘీక రుగ్మతల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కె వేణుగోపాల్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ రవాణా చేసినా, అమ్మినా, సేవించినా కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస ఇంగ్లీషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ జి సురేష్‌బాబు, ప్రజలు, ఆటోవర్కర్స్ పాల్గొన్నారు.


సంగం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వేమారెడ్డి

●సంగం: మాదక ద్రవ్యాలకు యువత, విద్యార్థులు, ప్రజలు దూరంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక నేతాజీ జూనియర్ కళాశాలలో ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సాంఘీక రుగ్మతల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ కరస్పాండెంట్ మదార్‌బాషా, అధ్యాపకులు, స్థానిక పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

●ఉదయగిరి రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మేకపాటి వెంకురెడ్డి మెమోరియల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, సామాజిక రుగ్మతల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు.

●దుత్తలూరు: మండలంలోని నర్రవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ ఆదిలక్ష్మి ఈవ్‌టీజింగ్, సైబర్‌నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా తమ జీవితాలకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు.

● వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్ఐ రఘునాథ్ ఆధ్వర్యంలో సాంఘీక రుగ్మతల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, ఉపా ధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

●సీతారామపురం: స్థానిక ఎల్‌వి ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గంజాయి, మత్తుపదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఏ ఎస్సై వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

●జలదంకి: మాదకద్రవ్యాల నియం త్రణ, సైబర్ నేరాలపై స్థానిక హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం ఎస్ఐ లతీఫున్నీసా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ హరిబాబు, పోలీసు సిబ్బంది, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●కొండాపురం : సైబర్ మోసాలు, మాదకద్రవ్యాలు తదితర విషయాలపై శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎమ్ వెంకటరావు, ప్రిన్సిపాల్ షేక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

●వలేటివారిపాలెం : చుండి మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు సైబర్‌క్రైమ్, ఈవ్‌టీజింగ్, నేరాలు ఎగైనెస్ట్ ఉమెన్స్ అనే అంశంపై శుక్రవారం ఎస్ఐ మరిదినాయుడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ శ్రీవెంకటేశ్వర్ పాల్గొన్నారు.

●గుడ్లూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుడ్లూరు సర్కిల్ సీఐ మంగారావు తెలిపారు. నేరాలపై ప్రజలకు అవాహన కల్పించేందుకు శుక్రవారం స్థానిక కమ్మపాలెం రామాలయం సెంటర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల తహసీల్దారు స్వర్ణ, ఎంపీడీఓ వెంకటేశ్వర రావు, ఎస్ఐ వెంకట్రావు, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

●బిట్రగుంట (దగదర్తి) నవంబరు 22: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా అడుగులు ముందుకు వేయాలని కావలి రూరల్ సీఐ పాపారావు తెలిపారు. బోగోలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల నిషేధంపై అవగాహన కార్యక్రమం ఎస్ఐ బోజ్యా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

●ఉలవపాడు : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని ఎస్ఐ అంకమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక జీవీఎస్ఎం కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపిచంద్ ప్రకాష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.


●కావలి : గంజాయి, ఇతర మారకద్రవ్యాలను ఎవరైనా విక్రయించినా తమ వద్ద ఉన్నా అలాంటి వారికి జరిమానాతో పాటు జైలు జీవితం తప్పదని విద్యార్థులు, యువత ఆ వ్యవసనాలకు దూరంగా ఉండాలని కావలి డీఎస్పీ శ్రీధర్ సూచించారు. స్థానిక జవహర్‌భారతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం గంజాయి, మారకద్రవ్యాల నియంత్రణపై రెండో పట్టణ సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, విశ్రాంత పీడీ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పకు గ్రామోత్సవం


గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో శుక్రవారం అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, అయ్యప్పస్వామి సేవాసమాజం ఆధ్వర్యంలో స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

ఆలయానికి భూ విరాళం


భూమి పత్రాలను ఈవోకు అందచేస్తున్న దాత దొడ్ల పద్మనాభరెడ్డి

సంగం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నారెడ్డిపాళెంలో ఉన్న ఆత్మారామస్వామి ఆలయానికి బుచ్చిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన దాత దొడ్ల పద్మనాభరెడ్డి 3.97 ఎకరాల భూమిని కానుకగా అందచేశారు. ఆ మేరకు భూమి పత్రాలు తదితరాలను ఆలయ ఈవో ప్రసాద్‌రెడ్డికి శుక్రవారం అందచేశారు. అంతేకాకుండా భూమికి సాగు నీటి వసతి కోసం తన సొంత నిధులతో బోరు పాయింట్ వేయడంతోపాటు, హద్దులు చూపించారు. దీంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు


టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

వలేటివారిపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అయ్యవారిపల్లె పంచాయతీ రామలింగాపురంలో శుక్రవారం టీడీపీ యువ నాయకులు వేమూరి రాజా ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ సభ్యత్వం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వేమూరి రాజా, పాలేటి రవి, మంచాల మాలకొండ్రాయుడు, మంచాల హరిబాబు, యల్లంపల్లి భరత్‌కుమార్, ఉప్పుటూరి మాల్యాద్రి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

బిట్రగుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల షాపులను శుక్రవారం కందుకూరు ఏడీఏ అన సూయ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. బోగోలులోని పురుగుమందుల షాపులో రికార్డులు సక్రమంగా నమోదు చేయక పోవడంపై ఆమె ఆగ్రహించారు. రికా ర్డులు సరిచేసుకున్న తరువాత వాటిని విక్రయించుకోవాలని ఆమె నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మీ ఉన్నారు.


రికార్డులు తనిఖీలు చేస్తున్న ఏడీఏ అనసూయ

‘స్వర్ణ’ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయండి

లింగసముద్రం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలోని అన్ని వివరాలను స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కందుకూరు డీఎల్పీఓ కృష్ణమోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక సచివాలయం-1ను ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులుతో కలిసి ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో పంచాయతీల ప్రొఫైల్‌ను డిజిటల్ పంచాయతీలో నమోదు చేసేవారని, ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు, స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, డ్రైన్లు, అన్నికులాల జనాభా వివరాలు, అసెస్‌మెంట్ రికార్డుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఇంటిపన్ను వసూలును వేగవంతం చేయాలన్నారు. అలాగే కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రానికి హౌస్‌హోల్డ్ సర్వేను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ న్యాయవాదుల పరిచయ కార్యక్రమం

కావలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కావలి బార్ అసోసియేషన్‌లో జూనియర్ న్యాయవాదుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కాటా సురేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శోభ, ప్రిన్సిపల్స్ జూనియర్స్ జడ్జి సుధాకర్, స్పెషల్ మేజిస్ట్రేట్ పరుశురామ్ పాల్గొన్నారు. సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్‌రెడ్డి , కెన్నడీ, పీవి శివప్రసాద్‌రెడ్డి, జగన్మోహన్‌రావు, సాయి ప్రసాద్‌లు వారి అనుభవంలో చేసిన కేసుల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం బాధ్యులు సునీల్‌బాబు, అభిషేక్, శ్రీకాంత్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు

లింగసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేకమైన పనులకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ మహబూబ్ సుబానీ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ ప్రజల అవసరాల దృష్ట్యా ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశ పెడితే కొందరు అక్రమార్కులు జేసీబీలు, ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తవ్వి టిప్పర్లతో కావలి, కందుకూరు పట్టణాలకు తరలిస్తున్నారని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా, మైనింగ్ పనులు, పేకాట వంటి పనులకు వెళ్లకూడదన్నారు.

ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటించాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ధర్మాన్ని పాటించాలని ఎస్ఐ ఆదిలక్ష్మి, జిల్లా మహిళా సమన్వయ ప్రముఖ్ కోటంరెడ్డి రాఘవరెడ్డి సూచించారు. శుక్రవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని నర్రవాడ శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలతోపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ధర్మప్రచారక్ వెంగళరెడ్డి, జిల్లా సహ కన్వీనర్ బ్రహ్మయ్య, మేకపాటి మాల్యాద్రినాయుడు, మాలేపాటి మల్లికార్జుననాయుడు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి నీటి శుద్ధి యంత్రం వితరణ

కావలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని ఎస్సీ బాలికల వసతిగృహాల సముదాయానికి శుక్రవారం హాస్టల్ వార్డెన్ ఉమాశంకర్ తన తండ్రి దానియేల్ జ్ఞాపకార్థం నీటిశుద్ధి యంత్రంను బహూకరించారు. వసతిగృహ విద్యార్థినులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న శుద్ధినీటి సమస్య ఎట్టకేలకు దాత సహకారంతో పరిష్కారం అయ్యింది.

14 మద్యం సీసాల స్వాధీనం

ఏఎస్ పేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. శుక్రవారం జమ్మవరం గ్రామానికి చెందిన వ్యక్తి ఏఎస్ పేట నుంచి 14 మద్యం సీసాలు తీసుకువెళ్తూ సాయిబాబా గుడి సమీపంలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ సైదులుకు దొరికాడు. దీంతో అతని వద్ద ఉన్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాదా బైనామా సమస్యలు పరిష్కరిస్తాం

● కావలి తహసీల్దారు శ్రావణ్‌కుమార్



కావలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల రైతులు ప్రధానంగా ఎదుర్కొనే భూ సమస్యలలో ఎక్కువగా సాదాబైనామా కేసులు ఉన్నాయని, ఉన్నతాధికారులు నుంచి అనుమతి వచ్చిన వెంటనే వాటికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తామని కావలి తహసీల్దారు శ్రావణ్‌కుమార్ తెలిపారు.

? మండలంలో ప్రధాన సమస్యలేవి.

! నియోజకవర్గంలో ఎక్కువగా భూసమస్యలు ఉంటున్నాయి

? భూ సమస్యలలో ప్రధానమైనది

! ప్రధానంగా రైతులు అగ్రిమెంట్ల మీద భూములు కొనుగోలు చేసుకుని సాగు చేసుకుంటున్నారు. వారికి రెవెన్యూ రికార్డులలో హక్కులు ఉండవు. ఈ విషయాన్ని రైతులు గుర్తించి రిజిస్ట్రర్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి.

? వాటి పరిష్కారానికి చర్యలేవీ.

! రైతులు అగ్రిమెంట్ల మీద కొనుగోలు చేసిన భూములను సాదాబైనామా కింద వారి పేర్లు నమోదు చేసుకోవచ్చు. ప్రభుత్వం నుంచి సాదాబైనామాకు అనుమతులు వచ్చిన వెంటనే వాటిని పరిష్కరిస్తాం

న్యూస్ బాక్స్

జొన్న, నిమ్మ పంటల పరిశీలన

చేజర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు సమన్వయకర్త డా. జి లలిత శివజ్యోతి ఆధ్వర్యంలో ఆత్మ పిడి శివన్నారాయణ, శాస్త్రవేత్తల బృందం శుక్రవారం చేజర్ల మండలంలోని కండాపురం, నాగులవెల్లటూరులో జొన్న, నిమ్మ పంటలను పరిశీలించారు. సస్యరక్షణ, తెగుళ్ల నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

అనంతసాగరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం గిరిజన కాలనీలో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో శారద, వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి, సిబ్బంది చిన్నయ్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

అనంతసాగరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు నారాయణరావు, జేవివి నాయకులు గాడి సుధాకర్, పీ నరసింహులు, సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ మురళి పాల్గొన్నారు.

రాయితీ పథకాలపై అవగాహన

ఉలవపాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుసేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు సూక్ష్మ సేద్య పథకాలు, ప్రభుత్వ రాయితీలపై ఉద్యాన అధికారి జ్యోతి, వ్యవసాయ అధికారి తిరుమల జ్యోతి శుక్రవారం అవగాహన కల్పించారు. బిందు, తుంపర్ల సేద్యంపై రైతులను ప్రోత్సహించాలని, రబీ ఈ-క్రాపు మీద రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని చెప్పారు.

పూడికతీత పనులకు ప్రాధాన్యం

లింగసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా పంట కాలువల పూడికతీత పనులకు ప్రాధాన్యం ఇస్తామని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పెంట్రాల పంచాయతీ కార్యలయంలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గతనెల 2న జరిగిన గ్రామసభలో గుర్తించిన పనులను ఆమోదించామన్నారు. ప్రస్తుతం పంచాయతీలో గ్రావెల్ రోడ్డు, ఇతర పనులను గుర్తించి పనులు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కిలారి కొండయ్య, ఈసీ చిన కోటయ్య కార్యదర్శి మాధవరావు, మధు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం : గ్రామాభివృద్ధికి ఉప యోగపడే పనులనే గుర్తించి వాటినే చేయా లని ఉపాధిహామీ ఏపీడీ బాబూరావు తెలి పారు. బడేవారిపాలెం సచివాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాది పనులు గుర్తింపు గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీడీ బాబూరావు మాట్లాడారు. ఉపాధి జాబ్‌కార్డులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ఉమామహేష్ టీఏ మాలకొండయ్య, గ్రామస్థులు సింహాద్రి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): స్థానిక 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. సీతారామపురం మండలం కుర్రపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఆయా సమయాల్లో పూర్తిగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు హాస్టల్ పరిధిలోనే నివసించాలి

● జిల్లా బీసీ సంక్షేమాధికారి కొల్లి ప్రసూన



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమశాఖ హాస్టళ్ల వెల్ఫేర్ ఆఫీసర్లు(హెచ్‌డబ్ల్యువో)లు హాస్టల్ ఉన్న ప్రాంతంలోనే నివసించాలని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారిణి కొల్లి ప్రసూన ఆదేశించారు. కొందరు హెచ్‌డబ్ల్యువోలు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారని, మరికొందరు ఇళ్ల నుంచే విధులు నిర్వహిస్తున్నార్న ఆరోపణలు ఉన్నాయి.

? హాస్టళ్లలో ఎవరెవరు ఉండాలి.

! హాస్టళ్లలో పిల్లల బాగోగులు చూడను, వారికి వంట వండి వడ్డించే ఏర్పాట్లు చూడటానికి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌తోపాటు కుక్, కామటి, నైట్ వాచ్‌మన్ ఉండాలి.

? హెచ్‌డబ్ల్యువోలు ఎక్కడైనా నివాసం ఉండవచ్చా.

! హెచ్‌డబ్ల్యువోలు హాస్టల్ ఉండే ప్రాంతంలోనే నివాసం ఉండాలి. నిత్యం విద్యార్థుల హాజరు వేసుకోవాలి. పాఠశాలకు వెళ్లి వచ్చిన తరువాత వారికి భోజన వసతి ఏర్పాట్లు చూడాలి. హాస్టళ్లు ఉండే ప్రాంతంలో నివసించని, విద్యార్థులకు అందుబాటులో లేనివారిపై చర్యలు తీసుకుంటాం.



? జిల్లాలో బీసీ హాస్టళ్లలో ఎన్నిదెబ్బతిన్నాయి.

! జిల్లాలో 79 బీసీ సంక్షేమ హాస్టళ్లు ఉండగా, వాటిలో 50 ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయి. మిగిలిన 29 ప్రైవేటు అద్దె భవంతుల్లో ఉన్నాయి. ప్రభుత్వ భవనాల్లోని 41 హాస్టళ్లలో కొన్నింటిలో మరుగుదొడ్లు దెబ్బతిన్నాయి. కొన్నింటిలో కిటికీలు, పైకప్పు, ద్వారబంధనాలు తదితరాలు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతుల కోసం నివేదిక పంపాం.

ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేటు దుకాణం

ఈ దుకాణం నెల్లూరులోని పాతమున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోనిది. ఇక్కడ మూడు డివిజన్లకు సంబంధించిన 8 సచివాలయాలున్నాయి. వివిధ పనుల నిమిత్తం నిత్యం ఎంతో మంది వస్తుంటారు. ఇది గమనించిన ఓ వ్యక్తి అక్కడకు వచ్చే ప్రజల అవసరాల కోసం ఇదిగో ఇలా అనధికారికంగా దర్జాగా దుకాణం పెట్టేశాడు. కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. కానీ ఓ కార్పొరేటర్ అండ ఉండటంతో ఇక ఆపేదెవరు...? అంటూ షాపు తెరిచాడు. జిరాక్స్, ఆధార్‌తోపాటు అన్నీ రకాల సేవలు ఇక్కడే లభిస్తున్నాయి. సాధారణంగా ఇలాంటి దుకాణాలకు కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగం బహిరంగ వేలం ద్వారా కేటాయింపులు జరపాల్సి ఉంటుంది. కానీ రాజకీయ మద్దతు ఉంటే అలాంటివేమీ అవసరం లేదని ఈ దుకాణం చెప్పకనే చెబుతోంది.



పాతమున్సిపల్ కార్యాలయంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన షాపు

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

మార్గం తెలిసేది ఎలా ?

ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారుల వెంబడి ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక బోర్డులు వాహనదారులకు శాపంగా మారాయి. మండలంలోని బుచ్చి- జొన్నవాడ మార్గంలోనిసాల్మాను పురం సమీపంలోని ఓ మలుపును గుర్తించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేసిన సూచికబోర్డును పిచ్చి మొక్కలు కమ్మేశాయి. అవి కనిపించక, మార్గం తెలియక పలువురు వాహనదారులు దారి తప్పుతు న్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ సూచికబోర్డు కనిపించేలా చర్యలు చేపట్టాలి.



చెట్ల పొదల్లో సూచిక బోర్డు

-బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)

మాదకద్రవ్యాలతో భవిష్యత్ విచ్ఛిన్నం

● పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి

పొదలకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్ విచ్ఛిన్నం అవుతుందని, వాటి నివారణకు సమష్టి కృషి చేయాలని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణారెడ్డి అన్నారు. కాలేజీలో మాదకద్రవ్యాల నివారణ, ఈవ్ టీచింగ్ ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మోటార్ వెహికల్ చట్టం, సీసీ కెమెరాల ఏర్పాటుపై పొదలలూకరు ఎస్‌ఐ హనీఫ్‌తో కలిసి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో గొప్పవాళ్లను చేయాలనే ఆశతో ఉంటే కొంత మంది యువత డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీఎస్.రెడ్డి, అకడమిక్ డీన్ చల్లా వెంకటకృష్ణ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ అన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, నెల్లూరు రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నేత పొట్టి సుధాకర్, కన్యకా పరమేశ్వ రి ఆలయ చైర్మన్ ఆదూరు సుబ్బులు పాల్గొన్నారు.

● విడవలూరు,(ఆంధ్రజ్యోతి): గంజాయి, కొకేన్ వంటి మాదకద్రవ్యాలు సేవించటం ప్రాణానికి హానికరమని విడవలూరు ఎస్‌ఐ నరేష్‌కుమార్ యాదవ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాలొని మాట్లాడారు. ఎక్కడైన మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దీనదాయాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పొదలకూరు : మాట్లాడుతున్న సీఐ శివరామకృష్ణారెడ్డి

● బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీలోని కృష్ణచైతన్య కళాశాలలో విద్యార్థులకు సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● రాపూరు,(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు బానిస అయితే భవిష్యత్ నాశనమవుతుందని రాపూరు ఎస్‌ఐ ఎం వెంకటరాజేష్ అన్నారు. రాపూరు పట్టణంలోని సీవీకే ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సీఐ పర్యవేక్షణలో మాదకద్రవ్యాల నివారణ, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, సైబర్‌క్రైమ్, మోటారు వెహికల్ చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటనాయక్, పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి శుక్రవారం కలిశారు. ఆ కార్పొరేషన్ గురించి వివరించారు. కార్పొరేషన్ అభివృద్ధికి సహకారం అందిస్తామని పవన్ హామీ ఇచ్చారు.

పన్ను కట్టకపోతే కరెంట్ కట్‌చేస్తారా? : సీపీఎం

నెల్లూరు(సిటీ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లలో భాగంగా మొండి బకాయిదారులపై కార్పొరేషన్ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారని, విద్యుత్ సరఫరా నిలిపివేయడం తగదంటూ సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఎస్‌ఈ రామ్మోహన్‌కు వినతిపత్రం అందచేశారు. నాయకుడు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ పన్ను చెల్లించకుంటే కరెంట్ తీసేయడం ఎక్కడా లేదన్నారు. పైగా కార్పొరేషన్ సిబ్బంది తప్పిదాలకు ప్రజలను బలిచేయడం సరైనది కాదన్నారు. పన్నుల పెంపు కోసం రెగ్యులరైజేషన్ పేరుతో చే పడుతున్న సర్వేలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. సూర్యనారాయణ, శ్రీనివా సులు, ఎం.ప్రసాద్, నరసింహ, పద్మ పాల్గొన్నారు.



ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

న్యూస్ బాక్స్

అజీజ్‌తో కోటంరెడ్డి భేటీ



అజీజ్‌ను సత్కరిస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(వైద్యం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌తో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి శుక్ర వారం భేటీ అయ్యారు. నగరంలోని అజీజ్ నివాసానికి వెళ్లిన కోటంరెడ్డి తాజా రాజకీయాలపై చర్చించారు. మంత్రి నారాయణ సహకా రంతో కార్పొరేషన్ పరిధిలో పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తామని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేసిన ప్రతిపనిని పూర్తి చేస్తామని ప్రకటించారు.

రామలింగేశ్వరుడి ఆలయ భూముల వేలం

విడవలూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విడవలూరులో వెలసివున్న రామలింగేశ్వర స్వామి ఆలయానికి చెందిన 14 ఎకరాల భూములను మూడేళ్ల లీజుకు కేటాయించడానికి దేవాదాయశాఖ అధికారులు యానాదయ్య, మోహన్ శుక్రవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం స్థానిక టీడీపీ నాయకుడు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి ఆ భూములను రూ.4.70 లక్షలకు పాడుకున్నారు. గతంలో ఈ భూములకు కౌలు రూ.2.80 లక్షలు ఉండగా ప్రస్తుతం జరిగిన వేలం పాటలో రూ.4.70 లక్షలు వచ్చింది. దీంతో దేవాదాయశాఖకి రూ.1.90లక్షలు ఆదాయం వచ్చిందని ఈవో యానదయ్య తెలిపారు.

సోమిరెడ్డికి ధన్యవాదాలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించడమేకాక, రాష్ట్ర అసెంబ్లీలో గిరిజన సమస్యలు ప్రస్తావించినందుకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ఎరుకల సేవా సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ ధన్యవాదాలు తెలిపారు. నగరంలోని ఎరుకల భవన్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో 500 కుటుంబాలకుపైగా నివసిస్తున్న గిరిజనుల అభివృద్ధికి జీఈయూపీ పథకం ఎంతగానో తోడ్పడుతుందని చెప్పటం హర్షదాయకమన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నెల్లూరు(క్రైం),నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్సీ సెంటర్ బస్టాప్ వద్ద శుక్రవారం అక్రమంగా మద్యం అమ్ముతున్న బట్టా శ్రీనివాసులు అనే వ్యక్తిని ఎక్సైజ్ నెల్లూరు-1 స్టేషన్ సిబ్బంది అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ బీ శ్రీధర్, కానిస్టేబుల్ జీసీ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం

విడవలూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విడవలూరు పంచాయతీ లైబ్రరీ వీధిలో నివాసం ఉంటున్న మురుగుళ్ల వెంకటసుబ్బయ్య(80) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. అయన నేత్రాలను మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో కుటుంబసభ్యుల సమాచారం మేరకు. మృతుని నేత్రాలను నెల్లూరు మోడరన్ ఐ ఆసుపత్రి వైద్యులు వేణు సేకరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(జడ్పీ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని సరస్వతి నగర్, వైఎంసీఏ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్రాంతినగర్, సరస్వతి నగర్, కేవీఆర్ పెట్రోల్ బంకు ప్రాంతం , లీలామహల్‌రోడ్డు, చాకలి వీధి, వహాబ్‌పేట, జూబ్లీ హాస్పిటల్ వీధి తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలియజేశారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నెల్లూరు (వైద్యం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని క్రైస్తవులు గత ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పడ్డారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రైస్తవుల సంక్షేమ కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఊరుందూరు సురేంద్రబాబు వెల్లడించా రు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో క్రైస్తవుల సంక్షేమానికి రూ.151 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు.

అట్టహాసంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు



కొడవలూరు : కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



బుచ్చి : ఖాజానగర్‌లో అన్నదానం చేస్తున్న సూరా శ్రీనివాసులురెడ్డి

కోవూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో టీడీపీ నాయకులు, అభిమానులు వాడవాడలా అట్టహాసంగా జరుపుకున్నారు. కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరుపుకున్న నేతలు పేదలకు అన్నదానం, పండ్లు, బ్రెడ్లు, దుస్తులు పంపిణీ చేశారు. కోవూరు రైల్వే ఫీడర్స్ రోడ్డులో భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, సన్నపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, గాదిరాజు భాస్కర్‌రావు, నాటకరాని వెంకట్, బాల రవి, సూరిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు. పడుగుపాడు, పోతిరెడ్డిపాలెం, ఇనమడుగు, లేగుంటపాడులో కేక్‌లు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

● **పేదలకు దుప్పట్ల పంపిణీ**

బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని జొన్నవాడ ఆలయంలో ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, అశోక్‌రెడ్డి, నందకుమార్, స్థానిక సర్పంచు పెంచలయ్య ఎమ్మెల్యే దంపతుల పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలంలోని మినగల్లులో సర్పంచు బొబ్బిరుపూజిత అధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బుచ్చిలోని లోటస్ గ్రాండ్ ఫంక్షన్‌హాలులో నాయకులు హరికృష్ణ, శివరామకృష్ణారెడ్డి, ఎంవీశేషయ్య, ప్రభాకర్‌రెడ్డి, హరనాథ్, తదితర నాయకులు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. రేబాలలో సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, తహసీల్దారు చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఖాజానగర్‌లో మైనారిటీ నాయకులు ఫిరోజ్, తదితర మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా సూరా శ్రీనివాసులురెడ్డి పేదలకు పంపిణీ చేశారు. అలాగే జొన్నవాడ, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డి.వెంకటేశ్వర్లు, చెంచయ్య, వి.శీనయ్య, కిషోర్, వుసురుపాటి రాఘవరెడ్డి, తాళ్లస్వామి, గిరి, బాలాకుమార్, దశరథ పాల్గొన్నారు. కాగా సూరా శ్రీనివాసులురెడ్డి, బత్తల హరికృష్ణ, ఎంవీ.శేషయ్య, వుసురుపాటి ప్రసాద్, కాటంరెడ్డి శశిధర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, తదితరులు విజయవాడకు తరలివెళ్లిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆమె నివాసంలో పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

● **నార్తురాజుపాలెంలో అన్నదానం**

కొడవలూరు,(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని టీడీపీ నాయకులు నార్తురాజుపాలెంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి ఎమ్మెల్యే హోదాలో తొలి జన్మదినం జరుపుకుంటున్న ఆమెకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రైవేటు ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. నార్తురాజుపాలెం ప్రధాన కూడలిలో పేదలకు అన్నదానం చేశారు. అలాగే గుండాలమ్మపాలెం సర్పంచు కోటంరెడ్డి దివ్యరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, మందపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కేతు వెంకటరమణారెడ్డి, చెక్క మదన్, పాటూరు రమేష్, గరికపాటి రాజేంద్రకుమార్, తువ్వర ప్రవీణ్, సిద్ధార్థ, బాబి, కోడూరు సుధాకర్, నాసిన ప్రసాద్ రెడ్డి, మురళి, పాల్గొన్నారు.

● **పండ్లు, రొట్టెలు పంపిణీ**

ఇందుకూరుపేట,(ఆంధ్రజ్యోతి): మండలంలో ని కొత్తూరు టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండ ల ప్రధాన కార్యదర్శి మునగాల రంగరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం ఇందు కూరుపేట సామాజిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జుననాయుడు, రాంప్రసాద్, ఈదూరు చెన్నయ్య, మనోహర్, కోవూరు మధు, రామచంద్రయ్య, పోలయ్య, పాల్గొన్నారు.

● **గ్రామాల్లో సంబరాలు**

విడవలూరు,(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదినం సందర్భంగా మండలంలోని విడవలూరు పార్లపల్లి, రామతీర్థం, గాదెలదిన్నె, ముదివర్తి, చౌకిచర్ల గ్రామాల్లో టీటీడీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. విడవలూరులో స్థానిక టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, మాతూరు శ్రీనివాసులురెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, చెముకుల శ్రీనివాసులు, సత్యవోలు సత్యంరెడ్డిలు కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. రామతీర్థంలో టీడీపీ నాయకుల అవుల వాసు, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీహరికోట గోపి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. పార్లపల్లిలో టీడీపీ నాయకులు అడపాల జనార్ధన్‌రెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, పూండ్ల ఏసోబులు కేక్ కట్ చేసి పేదలకు పంచిపెట్టారు.



విడవలూరు : అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

రేపు యాదవ భవన్‌లో కార్తీక భోజనాలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదవ భవన్ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని యాదవ్ భవన్‌లో ఆదివారం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నా మని ఆ భవన్ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ బొమ్మి నాగకిషోర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ కార్తీక భోజనాల సంద ర్భంగా గోపూజ, ఉసిరిక చెట్టు పూజ, శివ కేశవ పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయ న్నారు. మాజీ ఎంపీ బీద మస్తాన్‌రావు, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, టీడీపీ జాతీ య ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తదితరు లు పాల్గొంటారని చెప్పారు. జిల్లాలోని యాదవు లు పాల్గొనాలని కోరారు. వన భోజన ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. విలేకరుల సమావే శంలో అనంగి రమణయ్య, రాయి రమణయ్య, దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, మధుసూదన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వనభోజన ఆహ్వాన పత్రికను విడుదలచేస్తున్న నాగకిషోర్, దేవరాల సుబ్రహ్మణ్యం తదితరులు

రేపు కార్తీక వన సమారాధన

నెల్లూరు(సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి): జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన జరగనుంది. నగరంలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డులో గల ఆదిపరాశక్తి, మహాకాళీ సమేత మహామృత్యుంజయేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష్మీనారాయణ పూజ, గణపతి హోమం, రుద్ర, మహామృత్యుంజయ హోమాలు జరుగుతాయని, అనంతరం వనభోజన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని విశ్వబ్రాహ్మణ కుటుంబాలు అన్ని తరలిరావాలని కోరారు.

● **నరసింహ కొండపై...**

నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నరసింహ కొండపై కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శి పములుల శంకరయ్య తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో వనభోజనాల కరపత్రాలు ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. కార్తీక వన భోజనాలతోపాటు అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రత్యేక పూజలు, చిన్నారులకు ఆట పాటల పోటీలు జరుగుతాయని తెలిపారు. దేవాంగ కుటుంబాలు హాజరుకావాలని కోరారు.

తెలుగు సాహిత్యంలో చాటుపద్యం విశిష్టమైనది

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో చాటు పద్యం ఎంతో విశిష్టమైనదని, అందులో సమయస్ఫూర్తి, హాస్యం, చమత్కారం మొదలైనవి కలిసి ఉంటాయని గుంటూరు హిందూ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ నందనవనం శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని వర్ధమాన సమాజం హాల్‌లో చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చాటుపద్యం - హాస్యం అనే అంశంపై ప్రసంగించారు. ప్రాచీన, ఆధునిక కవులకు సంబంధించిన చాటు పద్యాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, నెల్లూరు రచయితల సంఘం అధ్యక్షుడు ఏ జయప్రకాష్, చేతన సంస్థ కార్యదర్శి వై శేషగిరీశం, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా శ్రీవారి అభిషేకాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక శుక్రవారం సందర్భంగా బాలాజీనగర్ సీతారామమందిరంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు జరిగాయి. అనంతరం పూలంగి సేవ, ఏడుగురు మహిళా భక్తులకు చీరల పంపిణీ జరిగాయి. కర్తం ప్రతాప్‌రెడ్డి, జ్యోతి దంపతులు పర్యవేక్షించారు.

మైపాడు బీచ్‌ను పర్యాటక కేంద్రంగా చేయాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మైపాడు బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కో వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ మైపాడు పరిసరా ల్లో చాముండేశ్వరి అమ్మవారి ఆలయంతోపాటు పలు దేవాల యాలు ఉన్న నేపథ్యంలో ఆ బీచ్‌ను మరింత అభివృద్ధి చేస్తే ఆ ప్రాంతం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా రూపదిద్దుకుం టుందని చెప్పారు. ఇందుకు పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పందిస్తూ బీచ్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా, కోవూరు నియోజకవర్గంలో మండలానికొక మినీ స్టేడియం ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్స హించాలని ప్రశాంతిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. విడవలూరు మండ లంలో అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియం నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు.

స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేల శుభాకాంక్షలు

ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి శాసన సభ స్పీకర్ అయ్యన్నపా త్రుడు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు జన్మదిన శుభాకాం క్షలు తెలిపారు. పుట్టినరోజు నాడు కూడా అసెంబ్లీకి హాజరైన ప్రశాంతిరెడ్డి అంకిత భావాన్ని స్పీకర్ ప్రశంసించారు. కాగా, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో ప్రశాంతిరెడ్డి భేటీ అయ్యారు. కోవూరు నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అంశాలను పవన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భం గా ఆమెకు పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ప్రశాంతిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు, మంత్రులతో సెల్ఫీ దిగుతున్న హోం మంత్రి అనిత

● టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. సిబ్బందికి ఎన్టీఆర్ విగ్ర హం వద్ద నూతన వస్త్రాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య కేక్ కట్ చేసి ప్రశాంతిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. నిస్వా ర్థ సేవ వేమిరెడ్డి కుటుంబానికే సాధ్యమవుతుం దని ప్రశంసించారు.

● నగరంలో ని మాగుంట లేఅవుట్‌లో ఉన్న నెల్లూరు హబ్‌లో ఎమ్మె ల్యే ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడు కలు ఘనంగా జరిగాయి. ఏపీఏ ఎంటర్‌ప్రైజెస్ అధినేత అర విందరెడ్డి ఆధ్వ ర్యంలో కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. కార్య క్రమంలో డార్లిం గ్ సునీల్, సుధీర్‌బాబు, షనీ, సతీష్, భూపే ష్, విజయ్, అమ ర్, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ ఆలయంలో కార్తీక శోభ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయానికి శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలతో కార్తీక శోభ సంతరించుకుంది. ఉదయం ఆలయంలో గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకీ సేవ నిర్వహించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

● ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ

నెల్లూరు (వైద్యం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో న్యాయ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులు జరుగుతుంటే ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. దిశా, నిర్భయ వంటి చట్టాలున్నా నిందితులకు శిక్షలు పడటంలేదని విమర్శించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమణయ్య, ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

న్యూ క్రాఫ్ట్ ఇండియా
క్రాఫ్ట్ బజార్
చేనేత వస్త్ర, హస్తకళా ప్రదర్శన మరియు అమ్మకం
సమయం : ఉదయం 11గం॥ నుండి రాత్రి 9.30 వరకు
తయారీదారులచే నేరుగా అమ్మకం
ప్రవేశం ఉచితం
చేనేత కార్మికులకు చేయూత నివ్వండి... హస్తకళాకారులను ఆదరించండి...
ఓపెన్ గ్రౌండ్, కస్తూరిదేవి గార్డెన్స్ ఎదురుగా, కె.వి.ఆర్ పెట్రోల్ బంక్ దగ్గర, నెల్లూరు

ఉత్తరక్రియలు



ప్రేమ, అప్యాయత మాకు పంచి, అందరినీ చిరునవ్వుతో పలుకరిస్తూ... మా ఇంటి దైవం
శ్రీమతి కొండపల్లి శ్యామల గారు
తేది: 07-11-2024 గురువారం స్వర్గస్తులైనారు. వారికి ఆత్మ శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
భర్త : కొండపల్లి సుబ్రమణ్యం
కుమారులు: కొండపల్లి రవీంద్రనాథ్, కె.విజయ్ కృష్ణ
కీ.శే. శ్రీమతి కొండపల్లి శ్యామల గారు
వైకుంఠ సమారాధన: తేది:23-11-2024 శనివారం నాడు నెల్లూరు, సంతపేట బ్రాహ్మణవీధి, వ్యాసరాజ మఠం (సత్యనారాయణస్వామి దేవస్థానం) నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.
నెల్లూరు ఏసీఎం - 9985411424





మనసు నిండా భక్తి నింపుకొని ఆనంద నిలయంలో అడుగు పెట్టగానే భక్తులంతా దివ్యానుభూతికి లోనవుతారు. మరికొన్ని అడుగులు వేయగానే కాంతులీనే శ్రీనివాసుడు కనిపించే సరికి భక్తితో తన్మయత్వం చెందుతారు. జయవిజయుల దగ్గరకు చేరగానే తేజోవంతమైన శ్రీవారి మనోహర రూప దర్శనం చూసి ఆధ్యాత్మికానందంతో పరవశించిపోతారు. అంతా క్షణకాలమే! ఆ కాస్త సమయంలోనే శ్రీనివాసుడి మూలవిరాట్ స్వరూపం భక్తుల మదిలో ముద్రపడిపోతుంది. తిరుమలేశుడి రూపం అంత స్పష్టంగా కపించేలా చేస్తున్నది ఆధునిక విద్యుత్ వెలుగులు కాదు. కేవలం నెయ్యి దీపాలు. తరాలుగా ఈ నెయ్యి దీపాల వెలుగులోనే గర్భగుడిలోని వెంకటేశ్వరుని దర్శనం భక్తులకు కలుగుతోంది.



వేసవి వెళ్లిపోయింది. వానలు కురుస్తూనే శరద్రుతువు వచ్చేసింది. భగభగమండే ఎర్రనయ్య.. పసుపు పండులా మారిపోయాడు.

- శుక్రవారం సాయంత్రం తిరుపతి నగరంలో కనిపించిన దృశ్యం.

భళా..భాగవతార్



భక్తితత్వమే ప్రధానంగా ఆవిర్భవించి కాలానుగుణంగా కనుమరుగవుతున్న హరికథకు ప్రాణం పోస్తున్నారు ఒంటి రవి. కార్వేటినగరంలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తూ మరోపక్క తనలోని కళాప్రతిభను చాటుకుంటున్నారు. భక్తి, వినోదం, విజ్ఞానాన్ని అభినయపూర్వకంగా ప్రదర్శిస్తున్నారు. ప్రేక్షకుల మన్ననలందుకుంటున్నారు.

6లో

కొండలా పేరుకున్న చెత్త



తిరుమలలో కొండలా పేరుకుపోతున్న చెత్తపై టీటీడీ ఫోకస్ పెట్టింది. గడచిన ఐదేళ్లూ పట్టించుకోకపోవడంతో వ్యర్థాలు గుట్టలా పోగయ్యాయి. టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక బీఆర్ నాయుడు డంపింగ్‌యార్డును పరిశీలించి విస్తుపోయారు. ఈ నేపథ్యంలో ఈవో శ్యామలరావు శుక్రవారం సందర్శించారు. మూడునాలుగు నెలల్లో చెత్త తరలింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

సిట్ సిద్ధం



తిరుపతి చేరుకున్న బృందాలు

భూదేవి కాంప్లెక్స్‌లో కార్యాలయం

కల్తీ నెయ్యిపై నిగ్గు తేల్చనున్న దర్యాప్తు

తిరుపతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలపై విచారణకు సుప్రీం కోర్టు నియమించిన సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) బృందానికి సంబంధించిన సిబ్బంది శుక్రవారం తిరుపతి చేరుకున్నారు. వారికి అలిపిరి సమీపంలోని భూదేవి కాంప్లెక్సులో కార్యాలయం కేటాయించారు. అక్కడ అవసరమైన సదుపాయాలన్నీ ఏర్పాటయ్యాక సిట్‌ను నడిపే కీలక అధికారులు రానున్నారు. ఆపై టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చనున్నారు. సిట్ విచారణకు వివిధ అంశాల్లో సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 31 మంది సిబ్బందిని నియమించింది. ఆ సిబ్బంది శుక్రవారం తిరుపతి చేరుకుని పరిపాలనా విభాగం అదనపు ఎస్పీ ఎదుట రిపోర్టు చేసుకున్నారు. అనంతరం సిట్‌కు కార్యాలయం కేటాయించిన భూదేవి కాంప్లెక్సులోని పాత ఎస్వీబీసీ భవనానికి చేరుకున్నారు. అందులో సిట్ బృందానికి అవసరమైన సదుపాయాలన్నీ ఏర్పాటవుతున్నాయి. వారం పది రోజుల్లో అవన్నీ పూర్తయ్యాక సిట్ కీలక అధికారులు ఐదుగురు తిరుపతికి రానున్నట్టు సమాచారం. తిరుపతి కేంద్రంగా సిట్ చేపట్టే దర్యాప్తులో సహకరించేందుకు వచ్చిన సహాయక సిబ్బందిలో మదనపల్లె, కర్నూలు, తిరుపతి, ఒంగోలు ప్రాంతాలకు చెందిన నలుగురు డీఎస్పీలు, రాయలసీమ జిల్లాలకు చెందిన ఎనిమిది మంది సీఐలు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, అటెండర్లు వంటి సిబ్బంది 19 మంది ఉన్నారు.

వారం పది రోజుల్లో రానున్న కీలక సభ్యులు

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిని తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ అనే సంస్థ కల్తీ చేసి సరఫరా చేసిందన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా శ్రీవారి భక్తులను తీవ్ర మనోవేదనకు గురిచేసిన సంగతి తెలిసిందే. లడ్డూ నాణ్యత, రుచి, సువాసన వంటి వాటిపై తరచూ భక్తుల నుంచీ ఫిర్యాదులు అందిన నేపథ్యంలో టీటీడీ ఈవో శ్యామలరావు చొరవ తీసుకుని నెయ్యి నమూనాలను పరీక్షల నిమిత్తం గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ అనుబంధ ల్యాబ్‌కు పంపడం, ఆ పరీక్షల్లో నెయ్యి నాణ్యత దారుణంగా ఉందని, అందులో జంతు కొవ్వు, చేప నూనె వంటి పదార్థాలు కల్తీ చేశారని ల్యాబ్ అనుమానం వ్యక్తం చేయడం తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించింది. విచారణలో ఏఆర్ డెయిరీ తమిళనాడులోని దిండిగల్ నుంచీ కాకుండా తిరుపతికి చేరువలోనే ఉన్న వైష్ణవి డెయిరీ నుంచీ నెయ్యి సేకరించి దాన్నే టీటీడీకి సరఫరా చేసినట్టు వెల్లడైన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో సుప్రీం కోర్టు గత అక్టోబరు 4వ తేదీన సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ పోలీసు నుంచి ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు చొప్పున మొత్తం ఐదుగురు అధికారులతో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను నియమించింది. అప్పటి నుంచి సిట్ విచారణ ఎప్పుడు మొదలవుతుందా? ఆ విచారణలో ఏమి తేలుతుందా? అని దేశవ్యాప్తంగా శ్రీవారి భక్తులు ఆత్రుతగా వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సిట్ సహాయక సిబ్బంది తిరుపతి చేరుకోగా వారం పది రోజుల్లో సిట్ కీలక సభ్యులు రానున్నారు. మొత్తం మీద సుప్రీం కోర్టు విచారణకు ఆదేశించిన నెలన్నర తర్వాత ఆ దిశగా కదలిక మొదలైంది. కీలక సభ్యులు వచ్చి విచారణ ప్రారంభిస్తే నెల రోజుల్లోనే ముగించి సుప్రీం కోర్టుకు నివేదిక అందజేసే అవకాశముందని సమాచారం.

తిరుమల గర్భగుడిలో నేటికీ

నెయ్యి దీపాలే!

తిరుమల ఆలయం (గర్భాలయం మినహా)లో ఒకప్పుడు వెలుగులు ప్రసరించేలా 24 దీపాలను వెలిగించేవారు. కాలానుగుణంగా ఆ నేతి దీపాల స్థానంలో కిరోసిన్, నూనె, తర్వాత విద్యుత్ వెలుగులు వచ్చాయి. గర్భాలయంలోకి మాత్రం వీటికి ప్రవేశం లేదు. ఇప్పటికీ అఖండ దీపాలే వెలుగుతూ ఉన్నాయి. మూలభాగాల్లో రెండు అఖండ దీపాలుంటాయి. మరో రెండు దీపాలు వేలాడుతూ ఉంటాయి. రోజూ ఈ దీపాలకు దాదాపు 30 కిలోల నెయ్యి వినియోగిస్తారు. గర్భాలయ దీపాల పర్యవేక్షణను ఇద్దరు ఏకాంగులు నిర్వర్తిస్తారు. సుప్రభాతసేవలోనూ, మొదటిగంట నిర్వహించే సమయంలోనూ, కల్యాణోత్సవం తర్వాత 1.30 గంటలకు, రాత్రి నైవేద్యం గంట సమయంలో ఈ దీప కుండీల్లో నెయ్యిని నింపుతారు. వత్తులు ఎగదోయడం, మసిని తుడవటం వంటివి చేస్తారు. జయవిజయుల నుంచి గర్భాలయంలోని శ్రీనివాసుడు వృద్ధులకు సైతం స్పష్టంగా కనిపించేలా కాంతి తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. క్షణకాల దర్శనంలో స్వామి రూపం మదిలో నిలిచిపోవడంలో ఈ దీప కాంతులు ప్రధాన పాత్ర పోషిస్తాయి.

బ్రహ్మ వెలిగించిన దీపాలు



వెంకటేశ్వరుడు ఆనంద నిలయంలోకి ప్రవేశించిన శుభ సమయంలో బ్రహ్మదేవుడు రెండు అఖండ దీపాలను వెలిగించాడనేది ఐతిహ్యం. ఈ దీపాలను 'బ్రహ్మ అఖండం' అని కూడా వ్యవహరిస్తారు. శ్రీనివాస ప్రభూ.. నేను వెలగించిన అఖండ దీపాలు కలియుగాంతం వరకు నిరాటంకంగా ప్రకాశించాలి. అంతవరకు కొంగుబంగారమై భక్తులకు వరాలను గుప్పించాలని బ్రహ్మ కోరారట. 'కలియుగాంతమయ్యాకే ఆ దీపాలు రెండు శాంతిస్తాయి. అంతవరకు భక్తుల కోరికలు తీరుస్తూ ఉంటాను. తర్వాతే వైకుంఠానికి వెళ్తాను. అప్పుడే ఆనంద నిలయం కూడా అదృశ్యమవుతుందని శ్రీనివాసుడు బ్రహ్మాది దేవతలకు తెలియజేశారట. ఈ క్రమంలోనే వేల ఏళ్ల క్రితం వెలిగించిన దీపాలు నేటికీ దివ్య కాంతులను ప్రసరిస్తున్నాయి అని నమ్మకం.

శాసనాల్లో దీపాల నిర్వహణ

శ్రీవారి ఆలయం గర్భాలయ ప్రాకారంపై క్రీ.శ 8 నుంచి 18వ శతాబ్దం వరకు ఏర్పాటు చేసిన అనేక శాసనాల్లో ఈ దీపాల ప్రస్తావన ఉంది. వాటికి వినియోగించాల్సిన స్వచ్ఛమైన నెయ్యి గురించి స్పష్టంగా పేర్కొన్నారు. 1019 చోళరాజు రాజేంద్ర-1 కాలానికి చెందిన ఓ శాసనంలోనూ అఖండ దీపాల గురించి ఉంది. దీపాలకు వినియోగించే నెయ్యి, నిర్వహణ కోసం చేసిన దానాల గురించి ఈ శాసనాల్లో ఉంది.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



బల నిరూపణకు సిద్ధంకండి

తెలుగుదేశం అసంతృప్తులతో నేను మాట్లాడతా

- వైసీపీ కార్పొరేటర్లతో మంత్రి అనగాని
- టీడీపీలో చేరేందుకే సింహభాగం కార్పొరేటర్ల సుముఖత



మంత్రితో సమావేశమైన తిరుపతి కార్పొరేటర్లు

తిరుపతి, నవంబరు22(ఆంధ్రజ్యోతి) : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమవుతోంది. మున్సిపల్ ఎన్నికల చట్ట సవరణ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరేందుకు ఉత్సాహంగా ఉన్నారు. బీసీ నేత అన్నా రామచంద్రయ్య, వైసీపీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్దారెడ్డి నేతృత్వంలో గురువారం 10 మందికి పైగా కార్పొరేటర్లు విజయవాడకు పయనమైన విషయం తెలిసిందే. శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీలో ఉండలేమని, టీడీపీలోకి వచ్చేస్తామని మనసులో మాట చెప్పారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఈనెల 28న సీఎం సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలకు తిరుపతికి వస్తున్నామని, తమ పార్టీలోని అసంతృప్తులతో మాట్లాడతానని అన్నారు. పార్టీ అధిష్ఠాన నిర్ణయం మేరకే జరుగుతుందని చెప్పారు. 29న తిరుపతిలోనే ఉంటామని, పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేసుకోవాలని సూచించినట్టు తెలియవచ్చింది. కార్పొరేషన్ ఎన్నికల్లో ఓడిపోయిన వారి వివరాలను కూడా అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. రాబోయే పురపాలక ఎన్నికల్లో డివిజన్ల విభజన జరగనుందని, మరో 15 నుంచి 20 డివిజన్లు పెరిగే అవకాశం ఉందని, అందువల్ల కూటమిలో కార్పొరేటర్లుగా పోటీ చేయాలనుకునే వారికి ఎలాంటి ఇబ్బందీ ఉండబోదని మంత్రి చెప్పినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న కార్పొరేటర్లతో పాటు కొత్తగా వచ్చేవారితో 24 మంది కార్పొరేటర్లు ఉన్నారని మంత్రికి అన్నా రామచంద్రయ్య చెప్పారు. కాగా ఎక్కువ మంది టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు కనిపిస్తోంది. మంత్రిని కలిసిన వారిలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు పొన్నాల చంద్ర, కుడితి సుబ్రమణ్యం, పెంచలయ్య, దూది కుమారి, సీకే రవి, అన్నా అనిత, అన్నా సంధ్య తదితరులు ఉన్నట్టు సమాచారం.

డిప్యూటీ కలెక్టర్ మురళి సస్పెన్షన్ కొనసాగింపు

తిరుపతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని లీగల్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ గత జూలైలో సస్పెండ్ అయిన డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎస్.మురళికి సంబంధించి సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన మదనపల్లె ఆర్డీవోగా పనిచేసిన కాలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు, నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. ఆ నేపథ్యంలో గత జూలైలో మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అనుమానాస్పద స్థితిలో అగ్ని ప్రమాదం సంభవించడంతో కీలక ఫైళ్లన్నీ కాలి బూడిదయ్యాయి. ఆ ఘటనలో ఆయన ప్రమేయం ఉందన్న ఆరోపణలతో ప్రభుత్వం అదే నెల 29వ తేదీన సస్పెన్షన్ వేటు వేసింది. సస్పెన్షన్‌లో ఉండగానే తిరుపతి ఏసీబీ అధికారులు ఇటీవల ఆయనకు చెందిన నివాసాలు, బంధుమిత్రుల నివాసాలు, బినామీల నివాసాల్లో పెద్ద ఎత్తున దాడులు జరిపారు. ఆ సందర్భంగా ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారంటూ 06-ఆర్‌సీఏ-టీసీటీ-2024 క్రైమ్ నంబరుతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆయన్ను అరెస్టు చేసి నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండుకు ఆదేశించింది. కేసు నమోదై విచారణ చేపట్టిన నేపథ్యంలో మురళి సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.పి.సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా తిరుపతి విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించండి

తిరుపతి(విద్య), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు తక్షణం ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ సూచించారు. ఫీజు చెల్లించేందుకు ఈనెల 26వ తేదీ వరకు గడువు ఉందని, ఇప్పటికీ జిల్లాలో 14,916 మంది ఫీజులు చెల్లించలేదని వెల్లడించారు. ఫీజుల చెల్లింపులో 49 పాఠశాలలు వెనుకబడి ఉన్నాయని పేర్కొన్నారు. సకాలంలో ఫీజులు చెల్లించని పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటర్ల నమోదు

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శనివారం నుంచి రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరై ఓటర్ల నమోదు కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. తొలగింపుల కోసం ఫారం-7, సవరణకు ఫారం 8 స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండి ఇంకా ఓటు హక్కు పొందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంస్కృత వర్సిటీలో డ్రగ్స్ కలకలం!

- ఒడిశాకు చెందిన ఓ విద్యార్థిపై అనుమానం
- కూపీ లాగుతున్న పోలీసులు


తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం రేగింది. వర్సిటీ గరుడాచలం హాస్టల్లోని ఓ గదిలో డ్రగ్స్ ఉన్నాయంటూ వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు గణేష్ నేతృత్వంలో నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకోవాలని వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తిని డిమాండ్ చేశారు. దీనిపై వర్సిటీ అధికారులు ఆరా తీస్తున్నారు. పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే పోలీసులు ప్రాథమిక వివరాలను కొంతవరకు సేకరించినట్టు తెలుస్తోంది.

ఆరోపణలు ఇలా..

వర్సిటీలోని గరుడాచల హాస్టల్లో ఒడిశాకు చెందిన ఓ ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థి వద్ద 20 డ్రగ్స్ ప్యాకెట్లు ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్న మరో విద్యార్థికి 14 ప్యాకెట్లను అందజేసినట్లు ఆరోపిస్తున్నారు. పదుల సంఖ్యలో విద్యార్థులకు వాటిని అందజేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏబీవీపీ నేత గణేష్ ఈ మేరకు ఆరోపించారు.

అసలేం జరిగింది?

యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం రేగడంతో యూనివర్సిటీ డ్రగ్స్ కమిటీ అత్యవసరంగా సమావేశమైంది. అసలు ఏం జరిగిందంటూ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ తదితరులు డ్రగ్స్ కమిటీ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోపణలు వస్తున్న హాస్టల్ సిబ్బంది, విద్యార్థులను విచారించినట్లు చెప్పారు. చీఫ్ వార్డెన్‌ను పిలిపించి మాట్లాడారు. అంతా అబద్ధమని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమాశ్రీ కొట్టి పారేశారు.



విచారణ జరుపుతున్న వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ

డాగ్ స్క్వాడ్‌తో వాస్తవాలు నిగ్గుతేలుతాయా?

డాగ్ స్క్వాడ్ ద్వారా విచారణ చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల తిరుపతి రైల్వే స్టేషన్‌లో 22 కేజీల డ్రగ్స్ ప్యాకెట్లు డాగ్ స్క్వాడ్ ద్వారా దొరకడంతో ఇదే తరహాలో తనిఖీ చేయించాలనే అభిప్రాయం వినిపిస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో వర్సిటీలో డ్రగ్స్ అనవాళ్లు లేకుండా చేయవచ్చని యూనివర్సిటీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

రీసెర్చ్ ఫెలో, అసోసియేట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో పీఎం-ఉష పథకం ద్వారా మంజూరైన ప్రాజెక్టులో రీసెర్చ్ ఫెలో, రీసెర్చ్ అసోసియేట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇందుకు సంబంధించి డిసెంబరు 17వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్ చూడవచ్చునని ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ సి.వాణి తెలిపారు.



ఆయన లోకమే వేరు

పీకల దాకా తాగాడు. మత్తు తలకెక్కింది. నడిరోడ్డులో పడకేశాడు. రద్దీగా ఉండే ఆ మార్గంలో వాహనాలు వచ్చి తొక్కేస్తాయన్న భయం లేదు. ఎందుకంటే ఆయన ఈ లోకంలో లేడు. గురకపెడుతూ నిద్రపోతున్నాడు. ఈ దృశ్యం పుత్తూరు పట్టణం నడిబొడ్డున హెడ్‌మాస్టర్ బావి వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌కు కనిపించింది. వాహనాలు అదుపు తప్పితే చనిపోతాడని భావించిన ఓ మానవతావాది అతన్ని రోడ్డు పక్కకు లాగి పడేశాడు.

- పుత్తూరు, ఆంధ్రజ్యోతి

సంకల్ప 'బలం'

కష్టపడి బతకాలన్న సంకల్పం ముందు ఆయన వయస్సు చిన్నబోయింది. చిన్న వయస్సులో ఆసక్తితో రిక్షా డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఊహ తెలిశాక దాన్నే ఉపాధి మార్గంగా ఎంచుకున్నాడు. 40ఏళ్లుగా రిక్షా తొక్కుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నాడు తిరుపతికి చెందిన 60 ఏళ్ల రామదాసు. ఈ వయస్సులోనూ రైల్వేస్టేషన్ నుంచి యాత్రికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాడు. రిక్షా తొక్కడం వల్ల వచ్చిన దాంతో ముగ్గురు కుమార్తెలను చదివించడమేగాక పెళ్లిళ్లు చేసి పంపించాడు. కుమార్తెలు తమవద్దకు రమ్మని చెబుతున్నా ఇన్నాళ్లు దారి చూపిన మార్గాన్ని వదులుకోలేక ఇప్పటికీ రిక్షా తొక్కుతున్నట్లు సంతోషంగా చెబుతున్నాడు.

- తిరుపతి, అర్బన్, ఆంధ్రజ్యోతి





భావరాగయుక్తంగా ఆయన గళం విప్పితే ప్రేక్షకులు తన్మయత్వం చెందుతారు. భక్తితత్వంలో లీనమవుతారు. దివ్యవేదాంతం మొదలు చక్కటి చిక్కటి హాస్యం పండించే తీరుకు పండితులే కాదు పామరులూ మంత్రముగ్ధులవుతారు. ఆయనే హరికథకుడు ఒంటి రవి. నారాయణవనం మండలం తిరువట్యానికి చెందిన ఈయన తండ్రి ఆనందరెడ్డి రంగస్థల కళాకారుడు. తాత మునిసుబ్బారెడ్డి తుంబుర గాయకుడు. కళను వారసత్వంగా పునికిపుచ్చుకున్న రవి తెలుగుమీద మమకారంతో తిరుపతి ప్రాచ్యకళాశాలలో చదివారు. తనకు ఇష్టమైన హరికథలో విశారద పట్టా పొందారు. ఎస్వీయూ నుంచి తెలుగులో పీహెచ్‌డీ చేశారు. - పుత్తూరు (ఆంధ్రజ్యోతి)

భళా..భాగవతార్

●రచయితగా..హరి కథకుడిగా రాణిస్తున్న తెలుగు అధ్యాపకుడు రవి

ఆధునిక కాలగమనంలో ఉనికి ప్రశ్నార్థకమవుతున్న ప్రాచీన కళారూపాల్లో ఒకటైన హరికథకు ఊపిరిలూదుతున్న వారిలో రవి ఒకరు. తన కుమారుడు హరికథ నేర్చుకోవాలనేది రవి తండ్రి ఆకాంక్ష. ఈదిశగానే చిన్నప్పటి నుంచి ఆయన హరికథ వైపు మొగ్గు చూపారు. కుప్పంలో హైస్కూలులో తెలుగు పండిట్‌గ కెరీర్ ప్రారంభించారు. 59ఏళ్ల రవి ప్రస్తుతం కార్వేటినగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఉద్యోగాన్ని అంకితభావంతో నిర్వర్తిస్తూ మరోపక్క తాను అమితంగా ఇష్టపడే హరికథనూ ఏనాడూ విస్మరించలేదు. వచనాపాటవం, తెలుగు భాషాభిమానం,సందర్భోచిత హాస్య కుశలత మెండుగా ఉన్న రవి 1986లో నారాణవనంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో రంగస్థల అరంగేట్రం చేశారు. చదువుకునే రోజుల్లో రవీంద్ర భారతి(హైదరాబాద్)లో పార్వతీకల్యాణం హరికథను వినిపించారు. ఆ సందర్భంలో నటుడు అక్కినేని నాగేశ్వరరావు అభినందన ఆయనను ప్రోత్సహించింది. శ్రీకృష్ణ పాండవీయం ప్రదర్శన డాక్టర్ సి.నారాయణరెడ్డి ప్రశంసలందుకుంది. 1996లో అవధాని మేడసాని మోహన్ నిర్వహించిన అపూర్వ పంచసహస్ర అవధానంలో ఆయనలోని భాషాపటిమను బయటపెట్టింది. ఉత్తమ పృచ్ఛకుడి అవార్డు సొంతం చేసుకోగలిగారు. భారతం, భాగవతం, రామాయణం, శివపురాణాలను ఔపోసన పట్టిన ఆయన భాగవతార్‌గా నలభై ఏళ్లపాటు రాష్ట్రమంతా తిరిగారు. 2500 హరికథలను గానం చేసి ప్రేక్షకులను మెప్పించారు.

తెలుగుకు పట్టం

ఉద్యోగ విరమణ చేశాక తెలుగుబాషాభివృద్ధికి మరింత అంకితం కావాలని సంకల్పిస్తున్నాను. వ్యాకరణాంశాలు, పద్యాలు, లేఖారచనదు, ఛందస్సు, అలంకారాలపై పట్టు, గానం చేయడం లాంటి అంశాల్లో ఔత్సాహికులకు ఉచితంగా శిక్షణ ఇస్తాను. భారతం, భాగవతం, రామాయణం లాంటి ఇతి హాసాలను పాఠ్యాంశాలుగా పొందుపరచాలి. ప్రాథమిక పాఠశాలలో తెలుగుకు పట్టం కట్టాలి.

- ఒంటి రవి

రచయిత కూడా.. : రవి హరికథకుడే కాదు మంచి రచయిత కూడా. 2023 శ్రీసిటీలో ఉత్తమ రచయిత పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీవెంకటేశ్వర శతకం, వేదనారాయణ శతకం, అక్షర తపస్మాన్ గీతాలు, భాషా కవితల రచనలు చేశారు. రెండు పెదవులు దగ్గరకు చేరుకుండా పలికే పద్య రచన చేయడం ఆయన విశిష్టత. హావ భావ నటన వైదుష్య, హరికథాసుధానిధి, పండిత కవి వంటి 15 పురస్కారాలను పొందారు. సంగీతసాహిత్యాలతోపాటు అభినయపూర్వకంగా భక్తిని, విజ్ఞానాన్ని,వినోదాన్ని ప్రదర్శించడంతో దిట్టగా పేరు సంపాదించారు.

కొండలా పేరుకున్న చెత్త

● ఐదేళ్లుగా వ్యర్థాల ప్రాసెసింగ్‌లో నిర్లక్ష్యం

● సమస్యపై టీటీడీ చైర్మన్ ఫోకస్ ● మూడు నెలల్లో తొలగిస్తాం : ఈవో



డంప్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం కారణంగా తిరుమలలో మరో కొండను తలపించేలా చెత్త పేరుకుపోయింది. ఇక్కడి పర్యావరణానికి నష్టం కలిగేలా తయారైంది. పచ్చని చెట్ల మధ్య సుమారు లక్ష మెట్రిక్ టన్నుల వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. సాధారణంగా రోజూ తడిచెత్త 30 టన్నులు, పొడిచెత్త 40 టన్నులు సేకరిస్తున్నారు. దీనిని గోగర్భం డ్యాం సమీపంలోని డంప్‌యార్డ్‌కు తరలిస్తున్నారు. అక్కడ తడిచెత్తను ప్రొసెస్ చేశాక కంపోస్టు తయారు చేసి, మిగిలిన వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీ లేదా పవర్‌ప్రాజెక్ట్‌లు ఉండే ప్రాంతాలకు పంపాలి. కానీ ఐదారేళ్లుగా ఈ ప్రక్రియ సరైన రీతిలో జరగలేదు. పొడిచెత్తను కూడా వేరు చేసి పునర్వినియోగం చేయదగిన వాటిని తరలించాల్సి ఉంటుంది. గత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి తరలించడంలో కూడా విఫలమాయ్యారు. కంపోస్టు కేంద్రంలో సక్రమ నిర్వహణ జరగలేదు. వచ్చిన చెత్తంతా కుప్పగా పోస్తూ వచ్చారు. దీంతో కొండను తలపించేలా వ్యర్థాలు పోగుబడ్డాయి. ప్రాసెసింగ్ కాంట్రాక్ట్ ఎంపికలోనూ సిఫార్సులు, కమీషన్ల కక్కుర్తి కారణంగా ఈ పరిస్థితి ఎదురైందని సమాచారం. సాధారణంగా 70 టన్నుల చెత్త వచ్చే ప్రాంతం కనీసం మూడెకరాలైనా ఉండాలి. కానీ తిరుమలలోని డంప్‌యార్డ్ ప్రదేశం ఒకటిన్నర ఎకరా మాత్రమే. ఫలితంగా చెత్త గుట్టలుగా మారిపోయాయి. ఈ క్రమంలోనే టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తొలి ప్రాధాన్యతగా డంప్‌యార్డ్‌పైనే దృష్టిపెట్టారు.

పరిశీలించిన టీటీడీ ఈవో

తిరుమలలో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లో తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. గోగర్భం డ్యాంకు సమీపంలోని డంపింగ్‌యార్డ్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. లోపాలను గుర్తించి సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. చెత్తను కుప్పగా వేసేందుకు కాంట్రాక్ట్ సంస్థలు ఎందుకంటూ ఆగ్రహించారు. చెత్త విభజనలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఇలా కొనసాగితే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ చెత్త వల్ల దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టామన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై తిరుపతి మున్సిపాలిటీ అధికారులతో చర్చించామన్నారు. భవిష్యత్తులో శాస్త్రీయంగా డంపు చేసే విధానం అమలు చేస్తామన్నారు.



డంప్‌యార్డ్‌లో పేరుకున్న చెత్త



సినిమా చూస్తున్న గల్లా దంపతులు

సనాతన ధర్మం తెలిపే 'దేవకీనందన వాసుదేవ'

మాజీ మంత్రి గల్లా అరుణకుమారి

తిరుపతి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తన మనవడు అశోక్ నటించిన 'దేవకీనందన వాసుదేవ' చిత్రం సనాతన ధర్మాన్ని తెలియజేసేలా ఉందని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి పేర్కొన్నారు. గల్లా అశోక్ హీరోగా నటించిన రెండో చిత్రం దేవకీనందన వాసుదేవ సినిమా శుక్రవారం విడుదలైంది. గల్లా అరుణకుమారి, ఆమె భర్త గల్లా రామచంద్రనాయుడు మధ్యాహ్నం కృష్ణతేజ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి తిలకించారు. మనవడి నటన ప్రావీణ్యాన్ని చూసి సంబరపడ్డారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ అశోక్ హీరో కావడానికి చాలా కష్టపడ్డాడని, వెండితెరపై అద్భుతమైన నటనతో మరోసారి నిరూపించుకున్నాడని పేర్కొన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు చూడదగ్గ సినిమా అన్నారు. అంతకుముందు థియేటర్ వద్ద బాణసంచా పేల్చుతూ అభిమానులు వారికి స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, గిరిజ, ఊకా విజయ్‌కుమార్, బాలకృష్ణారెడ్డి, మునినాదం, బాబ్జీ తదితరులు సినిమా వీక్షించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 60,803 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,930 మంది తలనీలాలు సమర్పించారు.

వెటర్నరీ వర్సిటీలో ముగిసిన అడ్మిషన్ల ప్రక్రియ

బీవీఎస్సీ కోర్సులో వందశాతం సీట్లతో భర్తీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ నిర్వహించే పలు కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న నాలుగు బీవీఎస్సీ కాలేజీలు, 22 పాలిటెక్నిక్ కాలేజీలు, ఒక డెయిరీ డెక్నాలజీ కాలేజీల్లో ఖాళీగా ఉన్నట సీట్ల భర్తీకి అడ్మిషన్లు చేపట్టారు. బీవీఎస్సీకి సంబంధించిన 270 సీట్లు ఖాళీగా ఉండగా, 270 మందితో భర్తీ చేశారు. ఈ కోర్సుకు సుమారు 5 వేల మంది దరఖాస్తు చేశారు. అలాగే 10 ప్రభుత్వ, 12 ప్రైవేట్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 990 సీట్ల భర్తీకి అడ్మిషన్లు చేపట్టారు. ఈ కోర్సుల్లో 690 మంది విద్యార్థులు చేరారు. డెయిరీ టెక్నాలజీ కాలేజీలో ఖాళీగా ఉన్న 28 సీట్లకు 26 మంది విద్యార్థులు చేరారు. మార్చిలో ఎంవీఎస్సీ, పీహెచ్‌డీ కోర్సులకు నోటిఫికేషన్ వెలువరించేందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీఈ) చెంగల్రాయులు తెలిపారు.

తల్లీబిడ్డ అదృశ్యం

సత్యవేడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరుగుళంలో తల్లీబిడ్డ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన మునిశేఖర్ భార్య హేమావతి శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు ఇంటర్వ్యూకు వెళుతున్నానని చెప్పి తన కూతురు చిన్నారి నయనికను తీసుకుని గురువారం ఉదయం వెళ్లింది. రాత్రి ఇంటికి రాలేదు. మునిశేఖర్ బంధువుల ఇళ్లకు వెళ్లి ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ హస్తకళల ప్రదర్శనలో శ్రీకాళహస్తి కళాకారులు

శ్రీకాళహస్తి, నవంబరు 22: ఢిల్లీలో శుక్రవారం ప్రారంభమైన ప్రపంచ హస్తకళల ప్రదర్శనలో శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు కళాకారులు పాల్గొంటున్నారు. కొయ్యబొమ్మల కళాకారుడు గుమ్మడిపూడి దశరథాచారి, కలంకారి కళాకారుడు సుధీర్‌లకు అవకాశం లభించింది. తోలుబొమ్మల కళాకారుడు కుళ్లాయప్పకు అవకాశం దక్కింది. వరల్డ్ క్రాఫ్ట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని క్రాఫ్ట్స మ్యూజియంలో మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన జరుగుతుంది. కేంద్ర జౌళి శాఖ మంత్రి పవిత్రా మార్గరీటా శుక్రవారం దీన్ని ప్రారంభించారు. కొయ్యబొమ్మలు, కలంకారీ కళా ఉత్పత్తుల స్టాల్స్ ఇందులో ఏర్పాటు చేశారు. దేశ, విదేశీ కళాప్రియులు వీటిని సందర్శిస్తున్నారు. నిమ్మలకుంటకు చెందిన తోలుబొమ్మల కళాకారుడు కుళ్లాయప్ప కూడా ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు.



ఢిల్లీ ప్రదర్శనలో సందర్శకులతో శ్రీకాళహస్తికి చెందిన హస్తకళాకారుడు గుమ్మడి దశరథాచారి

లెక్క తేలుతోంది..!

● 34 అపార్టుమెంట్లకు పన్నుల తగ్గింపు

● ఇష్టారాజ్యంగా టెండర్ల ప్రక్రియ

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారుల అక్రమాలను వెలికితీసే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగంతో పాటు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొట్టారని ప్రాథమికంగా విచారణ కమిటీ గుర్తించింది. ఇదివరకు ఆడిట్ కమిటీ నిగ్గుతేల్చిన అంశాలే విచారణ కమిటీకి బ్రహ్మాస్త్రంగా మారినట్టు తెలుస్తోంది. మంత్రి నారా లోకేశ్‌కు వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాలతో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్స్ (డీఎంఏ) విచారణకు సిద్ధమయ్యారు. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. వారం రోజులుగా కార్పొరేషన్‌లో రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో)గా పనిచేసిన కేఎల్ వర్మ, మేనేజర్‌తో పాటు అకౌంటెంట్‌గా పనిచేసిన చిట్టిబాబులపై లోతైన విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. శనివారంతో విచారణ పూర్తిచేసుకుని మరో వారంలో నివేదిక సిద్ధ చేసేపనిలో విచారణ బృందం కసరత్తు చేస్తోంది. .రెవెన్యూ, పరిపాలన వ్యవహారాల అంశాలలో పెద్దఎత్తున అవినీతి జరిగినట్టు గుర్తించారు. టెండరుకు వెళ్లి చేయాల్సిన పనులు నామినేటెడ్ కింద ఇవ్వడం, అనర్హులకు కట్టబెట్టడం, బడ్జెట్ ఒకింత ఇస్తే రెండింతలు ఇష్టమొచ్చినట్టు ఖర్చుపెట్టడం, లేని అధికారులు చెలాయించి దుర్వినియోగం చేయడం వంటివి విచారణ కమిటీ గుర్తించినట్టు తెలుస్తోంది. అదేవిధంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన నిర్మాణాల కొలతలకు, రికార్డుల్లో నమోదు చేసిన వాటికి చాలా వ్యత్యాసం ఉన్నట్టు సమాచారం. అడ్డగోలుగా కొలతలు తగ్గించడం, పార్కింగ్ వేయాల్సిన చోట వేయకుండా పన్నులు తగ్గించడం వంటివి బయటపడినట్టు తెలిసింది. దాదాపు 34 అపార్టుమెంట్లను పరిశీలిస్తే 250కు ఫ్లాట్లకు ఇష్టారాజ్యంగా పన్నులు తగ్గించి వేసినట్టు సమాచారం. ఇంజనీరింగ్ విభాగంలోనూ గత డీజీ విజయకుమార్ రెడ్డిపై విచారణకు నియమితులైన పబ్లిక్ హెల్త్ ఈఈ సుబ్బరాయుడు కార్పొరేషన్ కార్యాలయం నుంచి పలు రికార్డులు తెప్పించుకుని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. చేయని పనులకు కూడా చేసినట్టు చూపించారని, కోట్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వేగవంతం

తిరుచానూరు, నవంబరు22, (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతిదేవి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈనెల 27న ఆలయంలో లక్ష కుంకుమార్చన జరగనుంది. 28న జరిగే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఇప్పటికే ఈ వేడుకలకు సంబంధించిన పనులను టీటీడీ అధికారులు వేగవంతం చేశారు.

వాహన సేవలు ఇలా..

28వ తేదీ: ఉదయం ధ్వజారోహణం, రాత్రి చిన్నశేష వాహనం
29 : ఉదయం పెద్దశేషవాహనం, రాత్రి హంస వాహనం
30 : ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహ వాహనం
డిసెంబరు 1 : ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం
2: ఉదయం పల్లకి ఉత్సవం, సాయంత్రం వసంతోత్సవం
3: ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గరుడ వాహనం
4: ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం
5: ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహనం
6: మధ్యాహ్నం పంచమీతీర్థం, రాత్రి ధ్వజావరోహణం
7: సాయంత్రం పుష్పయాగం.

సేవాభావంతో రైతులకు సేవలందించండి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది రైతులకు సేవాభావంతో సేవలందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు హెచ్చరించారు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలన్నారు. రబీలో ఈ-పంట నమోదులో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సాంకేతికత అధికారి హరిత వివరించారు. పంట, బీమా, పీఎం కిసాన్ గురించి సరళ, గాయత్రి సిబ్బందికి వివరించారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్‌పై జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్ వివరించారు. వరి సాగులో పరిమితంగా రసాయనాల వినియోగంపై ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన అధిపతి డాక్టర్ మురళీకృష్ణ రైతులకి శిక్షణ ఇచ్చారు. సిబ్బందితోపాటూ జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కళాశాల ఆర్డినేటర్ భాస్కరయ్య, ఏడీఏ లక్ష్మీదేవి, ఏఓలు వేణుగోపాలరావు, శ్రీనివాస్, శశికళ పాల్గొన్నారు.

ప్రహరీ కూలి ఒకరి మృతి

● ఐదుగురికి గాయాలు



గాయపడిన కూలీలు - మృతి చెందిన రానా

చంద్రగిరి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర కాలనీ సమీపంలో రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంలో ప్రహరీ గోడ కూలి ఒకరు మృతి చెందారు. ఆరుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. సుధాకర్‌రెడ్డికి చెందిన స్థలంలో రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. ఇందులో ఒడిశా కూలీలు పనిచేస్తున్నారు. 15 అడుగుల గొయ్యి తవ్వి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. శుక్రవారం ఉదయం కూలీలు గోడ పక్కన ఇసుక పోస్తుండగా ప్రహరీ గోడ కూలిపోయింది. రాజు, రమేష్, చాన్‌బాబు, స్వాతినాయక్, సత్యనారాయణశర్మ, కొల్లాకరన్ రానాలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కొల్లాకరన్ రానా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీలో జాగృతి యాత్ర బృందం



హావెల్స్-లాయిడ్ పరిశ్రమను సందర్శించిన జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముంబైకి చెందిన జాగృతి యాత్ర బృంద సభ్యులు 500 మంది శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. ఇందులో అమెరికా, యూరప్‌కు చెందిన 13 మంది విదేశీ ప్రతినిధులు ఉన్నారు. బృంద సభ్యులు రోల్ మోడల్‌గా ఎంచుకున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డితో పరస్పర చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు రవీంద్ర సన్నారెడ్డి వివరణ ఇస్తూ శ్రీసిటీ ఏర్పాటు సమయంలో తాము ఎదుర్కొన్న సవాళ్లు, అనుభవాలను వివరించారు. అనంతరం శ్రీసిటీ పరిసరాలను వీక్షించడంతో పాటు డైకిన్, హ్యావెల్స్ ఈప్యాక్, బాల్ కార్పొరేషన్, థెర్మాక్స్, మెక్‌విన్, జెడ్‌టీటీ, ఎంఎండీ, ఏఎల్ఎఫ్ ఇండియా, బెర్డిన్ పైప్స్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్స్, బ్రేక్స్ ఇండియా పరిశ్రమలను సందర్శించారు.

వ్యాసరాజ మఠాధిపతిని కలిసిన ఈవో



తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): వ్యాసరాజ మఠాధిపతి విద్యాశ్రీశతీర్థ స్వామిజీని తిరుమలలో టీటీడీ ఈవో శ్యామలరావు దంపతులు శుక్రవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామిజీ ఈవో దంపతులకు ఆశీర్వచనం చేశారు. ఇటీవల భక్తులకు టీటీడీ అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని ఈవోను స్వామిజీ అభినందించారు.

భారీ వాహనాలతో రహదారి ధ్వంసం

లారీలను అడ్డుకున్న శిరసనంబేడు గ్రామస్తులు



వాహనాలకు అడ్డంగా నిలబడి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పెళ్లకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామం మీదుగా వెళ్తున్న భారీ వాహనాలతో రహదారి అడుగడునా గుంతలు పడి ధ్వంసం అయింది. దీనిపై ఆగ్రహించిన గ్రామస్తులు శుక్రవారం లారీలను అడ్డుకున్నారు. శిరసనంబేడు సమీపంలో ఉన్న ఓ పరిశ్రమ నుంచి నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో గ్రామాలని అవతల నిర్మించిన బైపాస్ రోడ్డు ధ్వంసం అయింది. దీంతో గురువారం రాత్రి ముళ్లకంప రోడ్డుపై వేసి తగలపెట్టారు. శుక్రవారం వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పరిశ్రమ యాజమాన్యం సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను కలసి ఘటనను వివరించారు. ముందు రోడ్డును అభివృద్ధి చేయాలని పరిశ్రమ యాజమాన్యానికి నెలవల సూచించారు. ధ్వంసమైన రహదారిని వారం రోజుల్లో మరమ్మతులు చేపడతామని యాజమాన్యం అంగీకరించడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

మడుగులా రహదారి



దొరవారిసత్రం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కల్లూరుకండ్రిగ గ్రామం వద్ద సూళ్లూరుపేట - వాకాడు ఆర్‌అండ్‌బీ రహదారి నీటి మడుగులా ఉంది. వర్షాలకు పంట పొలాల్లో పడిన నీరంతా రహదారి పైకి వచ్చి నిల్వ చేరింది. వర్షపు నీరు తూర్పు వైపున పొలాల వైపు ప్రవహించాల్సి ఉంది. అయితే రహదారి లోతట్టు ప్రాంతం కావడంతో రోడ్డుపైన నిల్వ ఉండిపోయి మడుగులా మారింది. నీరు నిల్వచేరిన చోట పాచిపట్టిపోవడంతో పాటు రోడ్డుపై రెండు చోట్ల గోతులు ఉండటంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ మోటారు సైకిల్ ప్రమాదానికి గురై ప్రయాణికుడికి చెయ్యి విరిగింది. అధికారులు స్పందించి రోడ్డుపై నీళ్ల నిల్వలేకుండా చేయడంతో పాటు, గోతులను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కండి: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న హరినాథరెడ్డి

వెంకటగిరి టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరినాథ రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. శుక్రవారం వెంకటగిరిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండలంలో జరిగిన సమావేశంలో హరినాథ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను శరవేగంగా అములు పరుస్తున్నారని, ఇచ్చిన వాగ్ధానాలను సైతం అమలుపరచడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున పోరాడి సాధించిన జీవోలను సైతం అమలు చేసేందుకు పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. ఈనెల 26న దేశ వ్యాప్తంగా 500 కలెక్టరేట్‌ల వద్ద కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, రైతు సంఘాల సమన్వయ సమితి, రాష్ట్రంలో ప్రజా సంఘాలు కలిసి నిర్వహిస్తున్నా పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, గురవయ్య, చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, శివకుమార్, మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, మురళి, మల్లిఖార్జున్, రంగయ్య, జాన్, మునీంద్ర, శివ, రాజయ్య, మణి, వెంకటయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం ఏర్పాటుకు చర్యలు తీసుకోండి



ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

చిల్లకూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహంలో బాలికల గురుకులాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను చిల్లకూరు మండల నాయకులు కోరారు. శుక్రవారం వారు అమరావతిలో ఎమ్మెల్యేను కలిశారు. వరగలి గ్రామంలో రూ. 3కోట్లతో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని నిర్మించారని, ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వసతి గృహంలో ఎస్సీ బాలికల గురుకులాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు మూగ శంకరయ్య, నెలటూరు చిరంజీవి, సతీష్‌యాదవ్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఇందిరానగర్ చవట గిరిజన కాలనీలోని గిరిజనులకు శుక్రవారం రోటరీవెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర డ్రైవింగ్ స్కూల్ వాసు సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు మాట్లాడుతూ ప్రస్తుతం చలికాలం కావడంతో పేద గిరిజనులు చలి నుంచి ఉపశమనం పొందేందుకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో దువ్వూరు రవీంద్రరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, ధనుంజయరెడ్డి, సనత్‌రెడ్డి, బలరామిరెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీవెస్ట్‌క్లబ్ సభ్యులు

నేడు, రేపు ఓటరు నమోదు శిబిరం

గూడూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలోని అన్ని బీఎల్‌వో కేంద్రాల వద్ద శనివారం, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఓటరు జాబితాలో తప్పులు, మార్పులు, చేర్పులను సరిచేసుకోవచ్చునని తెలిపారు.

29న జాబ్‌మేళా

గూడూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈనెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు శుక్రవారం తెలిపారు. పలు బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 5వ తరగతి నుంచి ఏదైనా డిగ్రీ, డిప్లమోలో ఉత్తర్ణులైన యువతీ, యువకులు అర్హులన్నారు. వివరాలకు 8639835953 నంబరును సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాయుడుపేట టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భరత్‌నగర్, ఎన్‌ఎస్‌ఆర్ కాలనీ, ఆర్మూగం నగర్, దర్గారోడ్డు, రాజగోపాలపురం, శ్రీరాంనగర్, ఆశోక్‌నగర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శివశంకర్ తెలిపారు.



బాపూజీ వీధి, బజారు వీధిలో లో రోడ్డుపైనే నిలిపిన ఆటోలు, ద్విచక్ర వాహనాలు

పార్కింగ్... పరేషాన్

- రోడ్లపైనే వాహనాల నిలిపివేత
- పట్టించుకోని అధికారులు

సూళ్లూరుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో రాకపోకలు సాగించాలంటే సాహం చేయాల్సి వస్తోంది. ఏళ్లుగా ట్రాఫిక్ చిక్కుముడి వీడక రోజూ పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, మున్సిపాలిటీ, పోలీసు అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో దశాబ్దాలుగా సూళ్లూరుపేటను వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. వెరసి పట్టణ ప్రజలు బజారు వీధుల్లో ప్రయాణమంటే నరకంగా మారింది. ముఖ్యంగా పట్టణంలో బాపూజీ వీధి, కచ్చేరి, జీఎన్‌టీరోడ్డు, పాండురంగ వీధుల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తున్నారు. దీంతో వీధుల్లో పాదచారులు కూడా పోలేని పరిస్థితి నెలకొంది. ఉదయం వేళల్లో వినాయకుడి గుడి సెంటర్, మున్సిపాలిటీ కార్యాలయం వద్ద, కచ్చేరి వీధుల్లో నిత్యం రాకపోకలు ఇబ్బందులు తలెత్తున్నాయి. కచ్చేరి వీధిలో కూరగాయల మార్కెట్, దుకాణాలు ఉండడంతో ఆటోలు, మినీ లారీలు నిత్యం రోడ్ల పైనే నిలిపివేయడంతో ట్రాఫిక్ పద్మవ్యూహం తప్పడం లేదు. వ్యాపార సముదాయాలే కాకుండా ఇండ్ల సంఖ్య కూడా పెరగడం పార్కింగ్ సౌకర్యాలు లేవు. దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు రోడ్డుపై అడ్డదిడ్డంగా ద్విచక్ర వాహనాలను నిలిపివేస్తున్నారు. పలువురు వ్యాపారులు సైతం రోడ్డును ఆక్రమించి తమ వస్తు సామగ్రి బయటపెడుతున్నారు. దీంతో మరింత కుచించుకుపోతున్నాయి. రెండేళ్ల క్రితం బాపూజీ వీధిలో ఆక్రమణలు తొలిగించి సిమెంటు రోడ్డు వేసినా ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. వివిధ పనుల నిమిత్తం బజారు వీధుల్లోకి వచ్చే ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ చేసేందుకు ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడం కూడా ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం. మున్సిపల్ అధికారులు, పోలీసులు ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ఓవరాల్ చాంపియన్ షిప్‌లో మొదటి, రెండవస్థానంలో నిలిచిన కోట, చిల్లకూరు జట్లకు షీల్డ్‌లు అందజేస్తున్న అధికారులు

క్రీడలతో ఉజ్వల భవిత

కోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌ఐవో ఆకుల శ్రీనివాసులు, అంబేడ్కర్ గురుకులాల నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్ జయలక్ష్మి అన్నారు. కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో మూడు రోజులపాటు జరిగిన గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. గుంటూరు, ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు జిల్లాలకు చెందిన 680 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. కబడ్డీలో విన్నర్‌గా అక్కంపేట(గుంటూరు), రన్నర్‌గా వాకాడు జట్లు, ఖోఖోలో విన్నర్‌గా కోట, రన్నర్‌గా వాకాడు, హ్యాండ్‌బాల్‌లో విన్నర్‌గా కోట, రన్నర్‌గా చిల్లకూరు, క్యారెమ్స్‌లో విన్నర్‌గా కోట, రన్నర్‌గా చెన్నూరు(గుంటూరు), చెస్‌లో విన్నర్‌గా తుండూరు, రన్నర్‌గా చిల్లకూరు జట్లు నిలిచాయి. కళాశాలల బాలుర గేమ్స్‌లో చాంపియన్ షిప్‌గా కోట, గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో కోట జట్టు నిలిచాయి. అదే విధంగా పాఠశాల విభాగంలో వాలీబాల్ విన్నర్‌గా దర్శి(ప్రకాశం), రన్నర్‌గా గురజాడ(గుంటూరు), కబడ్డీలో విన్నర్‌గా వాకాడు, రన్నర్‌గా అచ్చంపేట (గుంటూరు), ఖోఖోలో విన్నర్‌గా కోట, రన్నర్‌గా చిల్లకూరు, హ్యాండ్‌బాల్‌లో విన్నర్‌గా చిల్లకూరు, రన్నర్‌గా కోట, క్యారెమ్స్‌లో విన్నర్‌గా నిజాంపట్టణం (గుంటూరు), రన్నర్‌గా కోట, చెస్‌లో విన్నర్స్‌గా నాయుడుపేట, రన్నర్‌గా సత్తనపల్లి (గుంటూరు) జట్లు విజయకేతనం ఎగురవేశాయి. కోట జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్‌గా సాధించగా, చిల్లకూరు జట్టు రెండవస్థానంలో నిలిచింది. ఆయా జట్లకు ఆర్‌ఐవో ఆకుల శ్రీనివాసులు, డిప్యూటీ డీవీఈవో మధుబాబు, డీసీవో జయలక్ష్మి షీల్డ్‌లు, మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, ఎంఈవో మస్తానయ్య వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీరేష్ పాల్గొన్నారు.



మరమ్మతులకు గురైన 108 వాహనం - మూతపడిన చిల్లకూరులోని 108 కార్యాలయం

ఆగిన 108 సేవలు

నెల క్రితం మరమ్మతులకు గురైన అంబులెన్స్

చిల్లకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలో నెల రోజులుగా 108 సేవలు ఆగిపోయాయి. జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రికి తరలించేందుకు చిల్లకూరు మండలానికి ఒక 108వాహనాన్ని కేటాయించారు. చిల్లకూరులో 108 వాహనాలను నిలిపి ఉంచేందుకు, వాటి మరమ్మతులు చేపట్టేందుకు, సిబ్బంది వేచివుండే కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో రెండేళ్ల క్రితం ఈ కార్యాలయాన్ని మూసివేశారు. దీంతో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద వాహనాన్ని పార్కింగ్ చేస్తున్నారు. అయితే నెల రోజుల క్రితం 108 అంబులెన్స్ మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి దానిని బాగుచేయలేదు. అత్యసర సమయాల్లో ఇతర మండలాల నుంచి 108 వానాలను పంపుతున్నప్పటికీ అవి సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకోలేకపోతుందని బాధితులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చిల్లకూరులో 108 వాహనం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కొత్తపట్నం పంచాయతీ కార్యదర్శి టి.రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ నెల్లూరు జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో ఏకోలు వేణు శుక్రవారం తెలిపారు. రాజశేఖర్ గతంలో ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పలు అవకతవకలకు పాల్పడినట్లు అధికారులకు ఫిర్యాదులతో పాటు పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. కేశవరం పంచాయతీ కార్యదర్శి అల్లాభక్షును కొత్తపట్నం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఎరువుల్లో నాణ్యత లేకుంటే చర్యలు



దుకాణంలో ఎరువులను తనిఖీ చేస్తోన్న ఏడీ నాగార్జున సాగర్

చిట్టమూరు, నవంబర్ 22(ఆంధజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులను ఇవ్వకపోతే చర్యలు తప్పవని వెంకటగిరి ఏడీ నాగార్జున సాగర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన చిట్టమూరు వ్యవసాయాధికారి సుచేంద్ర ప్రసాద్‌తో కలిసి కొత్తగుంట, యల్లసిరి, మల్లాం, గ్రామాల్లో ఉన్న పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎమ్మార్పీ రేటు కంటే అధిక ధరలకు మందులు విక్రయించిన, నాశిరకమైన ఎరువులు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన ఖచ్చితంగా రైతులకు బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంగ కాలువల నిర్మాణాలకు అటవీ అనుమతులు ఇప్పించండి: విజయశ్రీ

తడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ కాలువలకు అవసరమైన అటవీ అనుమతులను ఇప్పించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. శుక్రవారం శాసనసభలోని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే విజయశ్రీ కలిశారు. అటవీశాఖ అడ్డంకులతో తెలుగు గంగ కాలువల నిర్మాణం పూర్తి కాలేదని, అవసరమైన అనుమతులను ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

అభివృద్ధి దిశగా నవ్యాంధ్రప్రదేశ్: నెలవల

నాయుడుపేట టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పాలనా అనుభవంతో నవ్యాంధ్ర ప్రదేశ్ అభివృద్ధి దిశగా పరుగులు తీస్తున్నదని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం శాసనసభ సమావేశాలను విజయవంతంగా నిర్వహించిందన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకే క్రీడా పోటీలు



ఫుట్‌బాల్ విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

గూడూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందు క్రీడా పోటీలు దోహదపడుతాయని ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ అన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫుట్‌బాల్ పోటీల్లో కావలి జవహర్‌భారతి కళాశాల జట్టు మొదటి స్థానం, కృష్ణచైతన్య కళాశాల జట్టు రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణరాజు, వెంకటేశ్వర్లు, రవీంద్రబాబు, ప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, మణికంఠ, తిరుపాల్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ఎన్‌సీసీ డే

కోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ డే జరిగింది. కళాశాల ప్రాంగణం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ఎన్‌సీసీ క్యాడెట్స్ సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ రవీంద్రారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు షూలు, జ్ఞాపికలు అందజేస్తున్న జేవీవీ సభ్యులు

గూడూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని గూడూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వరప్రసాద్ అన్నారు. శుక్రవారం పాఠశాలలోని విద్యార్థులకు వాకాటి రామమోహన్‌రావు సహకారంతో జేవీవీ ఆధ్వర్యంలో షూలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు షూలు అందజేయడం జరిగిందన్నారు. జిల్లాస్థాయి షటిల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పురుషోత్తమరావు, చెంచునారాయణ, నాగరాజు, పీడీ శివకుమార్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ జోనల్ చైర్మన్‌కు సత్కారం



సురేష్‌రెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా నియమితులైన సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని గూడూరుకు చెందిన బీజేపీ నాయకులు సత్కరించారు. శుక్రవారం నెల్లూరులో సురేష్‌రెడ్డిని కలిసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, దయాకర్‌రెడ్డి, సురేష్‌బాబు, నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు

తిరుమల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 60,803 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 21,930 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై దర్యాప్తు చేయాలి: కురుగొండ్ల

డక్కిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై లోతుగా దర్యాప్తు చేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేందుకే పనిచేసిందని, పేదల గురించి పట్టించుకోలేదని ఆయన విమర్శించారు.

షార్‌ను సందర్శించిన ప్రముఖులు



షార్‌లో వాణి మోహన్, మాధవి, కిరణ్మయి

సూళ్లూరుపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌ను శుక్రవారం ఆదాయపు పన్నుశాఖ కమిషనర్ మాధవి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(జీఏడీ) జీ.వాణి మోహన్ సందర్శించారు. ముందుగా వీరు అట్టకానితిప్ప పులికాట్ సరస్సును పరిశీలించారు. అనంతరం షార్‌లోని రెండు ప్రయోగ వేదికలు, స్పేస్ మ్యూజియాన్ని తిలకించారు. రాకెట్ ప్రయోగాలతో పాటు అంతరిక్షంలోకి పంపే ఉపగ్రహాల గురించి షార్ అధికారులు వివరించారు. వీరి వెంట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ నరసంహారావు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు: ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

వెంకటగిరి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం వెంకటగిరి ఎన్టీఆర్ కాలనీకి చెందిన కౌశిక్, మనెమ్మ జింగ్లాబంగ్లా వద్దకు వెళ్లారు తిరుగి వెంకటగిరికి వస్తుండగా కలపాడు వద్ద ఉన్న డక్కిలి నుంచి శ్రీకాళహస్తి వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కౌశిక్, మనెమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.